**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

ఎండకాలమందు నెండలు లేవంట
వర్షకాలమందు వానలేదు
చలియుపుట్టలేదు చలికాలమందున
పోయెకాలమొచ్చె పుడమియందు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 223 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 25-11-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం


- ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- హాజరైన పలుదేశాల న్యాయమూర్తులు

**న్యూఢిల్లీ, నవంబర్ 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారంనాడు జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆదివారంనాడు పదవీ విరమణ చేసిన సీజేఐ బిఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం.

-మిగతా 2 లో

# అన్ని రంగాల్లో పిల్లలు రాణించాలి

**చదువుతోనే ఉజ్వల భవిష్యత్**



- కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్
- తెలంగాణ నోయిడాగా కొడంగల్ అభివృద్ధి
- అభివృద్ధికి ప్రజలంతా అండగా నిలవాలి
- గతంలో ఎవరు సీఎం ఉన్నా కొడంగల్‌ను పట్టించుకోలే
- అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్ కు శ్రీకారం
- సొంత నియోజకవర్గం పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

**కొడంగల్, నవంబర్ 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
మన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, అత్యున్నత స్థానంలో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉన్నా ఇటువైపు చూడలేదని, అందుకే మీరిచ్చిన ఈ అవకాశంతో కొడంగల్‌ను తీర్చిదిద్దబోతున్నానని అన్నారు. అభివృద్ధితో వెళతున్న తనకు మీ ఆశర్వాదంతో మద్దతు పలకాలన్నారు. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభమవుతాయి. నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ

-మిగతా 2 లో





## నిరంజన్ రెడ్డి అవినీతితోనే ఓడారు



- ఫామ్‌హౌజ్‌లు కట్టుకుని పార్టీకి చెడ్డపేరు
- మాజీమంత్రిపై జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్

**హైదరాబాద్, నవంబర్ 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ మంత్రి చేసిన అవినీతికి వనపర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బపడిందని వ్యాఖ్యలు చేశారు. ఆయన మూడు నాలుగు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని.. చెప్ప లేనంత అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మార్వో ఆఫీస్‌ను కాల్చేస్తే కూడా ప్రజలు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని.. ఎదురు తిరిగిన 32

-మిగతా 2 లో

## ముగిసిన ఐ బొమ్మ రవి కస్టడీ

- రవికి, రవి స్నేహితుడు నిఖిల్‌కి మధ్య భారీగా డబ్బుల బదిలీ
- కీలక సమాచారం రాబట్టిన పోలీసులు






## నేడు అయోధ్యలో ప్రధాని మోడీ పర్యటన

- రామాలయంపై పతాకాన్ని ఆవిష్కరించనున్న మోడీ
- దేశం నలుమూలల నుంచి సుమారు 8000 మంది ఆహ్వానం

**అయోధ్య, -**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం అయోధ్యలో పర్యటించనున్నారు. ఇక్కడి రామ జన్మభూమి మందిర్‌ను దర్శించనున్నారు. రామాలయ నిర్మాణం పూర్తయినందుకు సంకేతంగా శ్రీరామజన్మ భూమి మందిర శిఖరంపై పతాకాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. ఈ ఘట్టం దేశ సామాజిక-సాంస్కృతిక-ఆధ్యాత్మిక ప్రయాణంలో మరో మైలురాయిగా పేర్కొంటున్నారు. ఇదేరోజు మార్గశిర మాసంలోని శుక్లపక్షంలో వచ్చే పంచమి కావడం, ఇదే అభిజిత్ ముహూర్తంలో సీతారాముల వివాహ పంచమి కూడా కావడం విశేషం. సిక్కుల తొమ్మిదవ గురువు గురుతేజ్ బహదూర్ ఆత్మబలిదాన దినోత్సం కూడా ఇదే రోజు వస్తోంది. 17వ శతాబ్దంలో అయోధ్యలో గురుతేజ్ బహదూర్ 48 గంటల సేపు ధ్యానం చేశారు. ప్రధానమంత్రి మంగళవారం ఉదయం 10 గంటలకు వశిష్ట, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, దేవి అహల్య, నిషదరాజు గుహుడు, శబరి మాత మందిరాలతో కూడిన సప్తమందిర్‌ను దర్శిస్తారు.

-మిగతా 2 లో

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ద్రోహం



**కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తాం**

- 42శాతం ఇవ్వకుండా దేశమంతా రాహుల్ ప్రచారం
- రాహుల్ బీసీ వ్యతిరేకతను ఢిల్లీలోనే ఎండగడతాం
- వచ్చే పార్లమెంటులో దీనిపై రాహుల్ చర్చించాలి
- బీఆర్ఎస్ నేతల సమావేశంలో కేటీఆర్ వెల్లడి

**హైదరాబాద్,నవంబర్ 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహంపై ఆ పార్టీ తీరును ఎండగడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి, అడుగడుగునా బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తామని అన్నారు. తెలంగాణ బీసీలకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతామని కేటీఆర్

-మిగతా 2 లో



## కుటుంబం యూనిట్‌గా స్మార్ట్ కార్డు

- అన్ని వివరాలతో అమలుకు సన్నద్ధం
- జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డు జారీ
- ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలు
- అదికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి,నవంబర్ 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
రాష్ట్రంలో ప్రతీ కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమలు చేయాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుటుంబ సాధికారిత కోసం ఈ వ్యవస్థను వినియోగించాలని సీఎం సూచించారు. సుపరిపాలనలో భాగంగా ఈ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించటంతో పాటు సులభంగా పౌర సేవలు అందించా లన్నదే ప్రభుత్వ లక్ష్యం.

-మిగతా 2 లో



## కేంద్రం దెబ్బతో దిగివచ్చిన మావోలు

- ఆయుధాలు వీడుతామని ప్రకటన
- కూంబింగ్ చర్యలు ఆపాలని షరతలు

**న్యూఢిల్లీ, -**
వరుస ఎనకౌంటర్లు, లొంగుబాట్లు, ఆపరేషన్ కగార్‌ల నేపథ్యంలో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిజానికి 90శాతం దెబ్బతినట్లుగానే భావించాలి. ఈ క్రమంలో ఆయుధాలను వీడటంపై మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధాలను వదిలే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆ మూడు రాష్ట్రాల సీఎంలకు విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి అనంత్ పేరిట బహిరంగ లేఖ విడుదలైంది. దేశం, ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను అంచనా వేస్తూ ఆయుధాలు త్యజించడం ద్వారా సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని మా పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సోను దాదా ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని మేం సమర్థిస్తున్నాం. కేంద్ర కమిటీ సభ్యులు సతీశ్ దాదా, చంద్రన్న ఇటీవల ఈ నిర్ణయాన్ని సమర్థించారు. ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ సైతం తుపాకులను వదిలేయాలని

-మిగతా 2 లో

## త్వరలోనే పంచాయితీ ఎన్నికలు

- రెండుమూడు రోజుల్లో నోటిఫికేషన్
- కొడంగల్ పర్యటనలో సిఎం రేవంత్ వెల్లడి





## బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర మృతి

- ధర్మేంద్ర మృతికి పలువురు సంతాపం
- సంతాపం తెలిపిన రాష్ట్రపతి, ప్రధానమంత్రి
- స్మశానవాటికలో నివాళి అర్పించిన సినీ దిగ్గజాలు




## గ్యాస్ ఛాంబర్‌లా ఢిల్లీ..

- సగం మంది ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హెూమ్..!



## ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

మొదటి తరువాయి

జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్శిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. వివిధ ధర్మాసనాల్లో పలు కీలక తీర్పుల్లో ఆయన భాగమయ్యారు. 370వ అధికరణను రద్దు చేస్తూ చారిత్రక తీర్పు ఇచ్చిన ధర్మసనంలో ఉన్నారు. బిహార్ ఎన్నికల జాబితా రివిజన్, పెగాసస్ స్పైవేర్ తీర్పులు కూడా ఉన్నాయి.ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్, కేంద్రమంత్రులు, ఇతరులు పాల్గొన్నారు.

## నిరంజన్ రెడ్డి అవినీతితోనే ఓడారు


మొదటి తరువాయి

మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకు పంపారంటూ మాజీ మంత్రిపై ఫైర్ అయ్యారు. ఇలాంటి అవినీతిపరుడిని చిత్తుగా ఓడించడం సరైన నిర్ణయమన్నారు. వనపర్తి నియోజకవర్గంలో నిరంజన్ రెడ్డి రాచరిక పాలనను తలపించారని విమర్శించారు. ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వని నిరంజన్ రెడ్డి తనకు తాను నీళ్ల నిరంజనుడుగా పేరు మార్చుకున్నారంటూ ఎద్దేవా చేశారు. 'నా గురించి ఇంకొక్కసారి ఎక్కడైనా మాట్లాడితే నీ తాట తీస్తా ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకో' అంటూ నిరంజన్ రెడ్డికి కవిత ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.

## ముగిసిన ఐ బొమ్మ రవి కస్టడీ

**రవికి, రవి స్నేహితుడు నిఖిల్‌కి మధ్య భారీగా డబ్బుల బదిలీ**
**కీలక సమాచారం రాబట్టిన పోలీసులు**

**హైదరాబాద్**




ఐబొమ్మ రవి పోలీస్ కస్టడీ ముగిసింది. 5 రోజుల కస్టడీలో సైబర్ క్రైమ్ పోలీసులు కీలక సమాచారం రాబట్టారు. రవి వెబ్ సైట్, డొమైన్ నెట్ వర్క్, ఐపీ మాస్క్‌లతో పాటు అన్నింటిపై పోలీసులు ఆరా తీశారు. 20 కోట్ల రూపాయల లావాదేవీలపై బ్యాంకు అధికారుల సహకారంతో బదిలీ వివరాలు తెప్పించుకుని మరీ పోలీసులు రవిని ప్రశ్నించారు. రవి స్నేహితులు, చెలెలు చంద్రిక వ్యవహారంపై వివరాలు సేకరించారు. రవి, అతడి స్నేహితుడు కలిసి టెక్నికల్ ఆపరేషన్స్, డేటా హైడింగ్, సర్వర్ యాక్సెస్, వీపీఎన్, ఐపీ మాస్కింగ్ వంటి అంశాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. రవికి, రవి స్నేహితుడు నిఖిల్‌కి మధ్య భారీగా డబ్బుల బదిలీలు జరిగినట్లు తేలింది. క్రింటో ద్వారా అమౌంట్ బదిలీ చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. 1లీశిబి యాప్ మాత్రమే కాకుండా ఇతర యాప్‌ల ద్వారా కూడా డబ్బులు సంపాదించినట్లు తేలింది. పోలీసుల ప్రశ్నలకు 'నేను ఒక్కడినే అన్ని చేశాను. నా వెనుక ఎవరూ లేరు'అని రవి చెప్పినట్లు సమాచారం. రవి కస్టడీకి సంబంధించి మంగళవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ సమావేశం నిర్వహించనున్నారు. ఐబొమ్మ రవిపై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో 5 కేసులు నమోదు అయ్యాయి. మిగతా కేసుల్లో సైబర్ క్రైమ్ పోలీసులు పిట్ వారెంట్ దాఖలు చేశారు. పలువురు నిర్మాతలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరపనున్నారు. పిట్ వారెంట్ ద్వారా మరోసారి విచారణకు సిద్ధమవుతున్నారు.

## నేడు అయోధ్యలో ప్రధాని మోడీ పర్యటన

మొదటి తరువాయి

11 గంటలకు శేషావతార్ మందిర్, మాతా అన్నపూర్ణ మందిరాలను దర్శించుకుంటారు. రామ దర్బార్ గర్భగృహం, రామలీలా గర్భగృహంలో పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో శ్రీ రామజన్మ భూమి మందిర్ శిఖరంపై కాషాయం రంగు పతాకాన్ని ప్రధాని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా రామరాజ్యం ఆదర్శాలు, జాతీయ సమైక్యత, భారతదేశ సమున్నత వారసత్వంపై ప్రధాని ప్రసంగిస్తారు. రామమందిరానికి సహాయం చేసిన దాతలను ఈ వేడుకలకు అధికారికంగా ఆహ్వానించనున్నట్లు ట్రస్ట్ ఇప్పటికే ప్రకటించింది. దేశం నలుమూలల నుంచి సుమారు 8000 మంది ఆహ్వానితులు ఈ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు

## కేంద్రం దెబ్బతో దిగివచ్చిన మావోలు

మొదటి తరువాయి

భావిస్తోంది. అయితే మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు మాకు ఫిబ్రవరి 15 వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాం. ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రాలకు మా పార్టీ కట్టుబడి ఉన్నందున ఈ నిర్ణయాన్ని సమష్టిగా చేరుకునేందుకు మాకు కొంత సమయం పడుతుంది. మా సహచరులను సంప్రదించి పద్ధతి ప్రకారం వారికి ఈ సందేశాలు తెలియజేసేందుకు సమయం కావాలి. ఇంత సమయం అడిగేందుకు ఇతర ఉద్దేశాలేమీ లేవు. త్వరగా కమ్యూనికేట్ చేసేందుకు మాకు వేరే సులభ మార్గాలు లేనందున ఈ వ్యవధిని కోరుతున్నాం. భద్రతా బలగాలు తమ కార్యకలాపాలు నిలిపివేయాలి. పీఎల్‌జీఏ వారోత్సవాన్ని నిర్వహించబోం. మా అన్ని కార్యకలాపాలను నిలిపివేస్తామని హామీ ఇస్తున్నాంఅని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయుధ విరమణపై మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన చేసింది. ఆయుధాలు వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే అప్పటి నుంచి ఆయుధాలను వదిలేస్తామని ప్రకటించింది. ఇప్పటికే బస్వరాజు ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ పునర్‌నిర్మాణం, వ్యూహాత్మక మార్పులు అవసరమని గుర్తించి ఆయుధ విరమణపై ప్రకటన చేస్తామని లేఖలో పేర్కొంది. సీసీఎంలో తీసుకున్న నిర్ణయం మేరకు జోనల్ కమిటీలకు సమాచారం ఇచ్చినట్టు మావోయిస్టు పార్టీ లేఖలో వెల్లడించింది.

## బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర మృతి

**ధర్మేంద్ర మృతికి పలువురు సంతాపం**
**సంతాపం తెలిపిన రాష్ట్రపతి, ప్రధానమంత్రి**
**స్మశానవాటికలో నివాళి అర్పించిన సినీ దిగ్గజాలు**



**ముంబై,**

సోమవారం ధర్మేంద్ర ఆరోగ్యం విషమించడంతో ఆయన కన్నుమూశారు.. సినీ ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని సోషల్ మీడియా వేదికగా గుర్తుచేసుకున్నారు. ధర్మేంద్ర పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో స్థానిక విల్లే పార్లీ శ్మశాన వాటికకు తరలించారు. ధర్మేంద్ర కన్నుమూశారన్న సమాచారం తెలుసుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని కడసారి చూసేందుకు శ్మశాన వాటికకే తరలివచ్చి, నివాళులర్పించారు. ధర్మేంద్ర మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 'భారతీయ సినిమాలో ఒక శకం ముగిసింది. తన నటనతో అనేక పాత్రలకు వన్నె తెచ్చారు. ఇది ఎంతో విచారకరమైన సమయం. ధర్మేంద్ర కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. చిత్ర పరిశ్రమకు తీరని లోటు ' అని రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు

# అన్ని రంగాల్లో పిల్లలు రాణించాలి

మొదటి తరువాయి

ఏర్పాటు చేయబోతున్నాం అని అన్నారు. కొడంగల్‌లో ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. సొంత నియోజకవర్గం కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలన్నారు. కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నాం. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తాం అని ప్రకటించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం అని వెల్లడించారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని అన్నారు. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తాం. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తాం.త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజలకు కోట్ల రూపాయలు ఇవ్వలేనని.. పిల్లలకు అంతకంటే విలువైన చదువు చెప్పించగలనని అన్నారు. చదువు జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. అందులో భాగంగా కొండంగల్ లో 5 వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిఎం పలు అభివృద్ధి కార్యక్రామలు చేపట్టడంతో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు కొత్త ఊపు వచ్చింది. మొత్తం రూ.103 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, పట్టణాభివృద్ధి నుంచి విద్య, సంక్షేమం వరకు అనేక రంగాల్లో ఈ పనులు ప్రారంభమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, నియోజకవర్గంలో మొత్తం 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.5.83 కోట్లు, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో 23 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.5.01 కోట్లు కేటాయించారు. గ్రామీణ పరిపాలనను బలోపేతం చేసేందుకు 10 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చించనున్నారు. బంజారా భవన్‌లో అదనపు సౌకర్యాల కోసం కాంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, నీటి సరఫరా, విద్యుదీకరణకు కలిపి రూ.3.65 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, ప్రొహిబిషన్ / ఎక్సైజ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1 కోటి, అగ్నిమాపక కేంద్రానికి రూ.1.30 కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.1.40 కోట్లు కేటాయించారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి రూ.4.91 కోట్లు, సీసీ రోడ్లు , భూగర్భ డ్రైనేజ్ (జఉఆ) వ్యవస్థ అభివృద్ధికి రూ.4.45 కోట్లు ఖర్చు చేయనున్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ద్రోహం

మొదటి తరువాయి

తెలిపారు. తెలంగాణ భవన్‌లో బీసీ ప్రజా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్‌తో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎలాంటి రిజర్వేషన్ల పెంపు జరగకముందే 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు తెలంగాణలో ఇచ్చినట్లు దేశవ్యాప్తంగా చెప్పుకుంటూ తిరుగుతున్న రాహుల్ గాంధీ చేస్తున్న మోసాన్ని దేశ ప్రజల ముందు ఉంచుతామన్నారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభలో అపోజిషన్ లీడర్‌గా ఉన్న ఆయన వెంటనే ఈ అంశం పైన పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలన్నారు. ఒకవేళ కేంద్రంలోని బీజేపీ సహకరించకుంటే రాహుల్ గాంధీ ఎందుకు ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తరని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి నిజంగానే బీసీలపై, 42 శాతం రిజర్వేషన్ల అంశం పైన చిత్తశుద్ధి ఉంటే ప్రైవేట్ మెంబర్ బిల్లు సైతం ప్రవేశపెట్టవచ్చు కదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశంపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ నుంచి ఎన్నికై ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు లోక్‌సభలో గళం లేవనెత్తాలన్నారు. బీజేపీ పదేపదే బీసీల మాట చెబుతుంది కానీ వారికి రిజర్వేషన్ల నుంచి మొదలుకొని నిధుల అమలు దాకా, ఓబీసీ సంక్షేమ శాఖ వరకు అన్ని అంశాల్లో ద్రోహం చేస్తున్నదని, బీజేపీ చేస్తున్న మోసాన్ని సైతం ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల చుట్టే మొత్తం అంశాన్ని తిప్పుతూ, కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే విద్య, ఉపాధి, ప్రభుత్వ కాంట్రాక్టులలో 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే అంశాన్ని పక్కన పెట్టిందని కేటీఆర్ అన్నారు. దీంతోపాటు బీసీలకు బ్జడెట్‌లో సంవత్సరానికి ?20,000 కోట్ల రూపాయలు కేటాయిస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. వచ్చే బ్జడెట్‌లో 20వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించేలా కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకువస్తామని కేటీఆర్ తెలిపారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్లతో పాటు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని గ్రామ స్థాయి వరకు వివిధ రూపాల్లో తీసుకువెళ్లాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణ పైన కేటీఆర్ పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీసీ వర్గాలకు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలోని ఏ ఇతర ప్రభుత్వ చరిత్రలో ఎప్పుడూ చేసిన దాఖలాలు లేవని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ముఖ్యంగా కుల వృత్తులకు సహకారం అందించడం నుంచి మొదలుకొని విద్యారంగంలో ఏర్పాటుచేసిన విద్యా సంస్థల వరకు బీసీ వర్గాలకు కేసీఆర్ చేసిన మేలును తెలంగాణలోని బీసీలు గుర్తుంచుకున్నారని, వారంతా కేసీఆర్ వెంటే ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్.. కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్ల పేరుతో చేస్తున్న మోసంపై ఒక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేస్తున్న మోసాన్ని పార్టీ నేతలంతా ప్రజల్లోకి తీసుకువెళ్తారని తెలియజేశారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను త్వరలోనే పార్టీకి అందజేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్న, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబం యూనిట్‌గా స్మార్ట్ కార్డు

మొదటి తరువాయి

కొన్ని పథకాలకు లబ్దిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లు కూడా ఈ వ్యవస్థ ద్వారా పరిష్కారం అవుతాయని అన్నారు. సచివాలయంలో ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పౌర సేవల్ని, ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి పర్యవేక్షించాలని, వచ్చే ఏడాది జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డును జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ నిర్వహిస్తున్న డేటా లేక్ ద్వారా సమాచార సేకరణ జరగాలి. రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు వచ్చే ఏడాది జూన్ నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఫ్యామిలీ కార్డును జారీ చేయాలన్నారు. 25 రకాల వివరాలతో పాటు పీ4 లాంటి అంశాలను అందులో చేర్చాలి.ఆర్టీజీఎస్ వద్ద ఉన్న సమాచారాన్ని ప్రామాణికం గా తీసుకుని ఇతర ప్రభుత్వ శాఖలు వినియోగించుకోవాలి. స్టాటిక్ డేటా, డైనమిక్ డేటా వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చూడాలి. వాక్సినేషన్, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధృవీకరణ, పౌష్టికాహారం, రేషన్ కార్డు, స్కాలర్‌షిప్, పెన్షన్లు సహా వేర్వేరు ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన వివరాలన్నీ ఈ కార్డు ద్వారా ట్రాకింగ్ జరిగేలా చూడాలి. కేవలం పెన్షన్లు, రేషన్ వంటి పథకాల వివరాలకు మాత్రమే ఈ ఎఫ్‌బీఎంఎస్ వ్యవస్థను పరిమితం చేయొద్దు. పౌరులకు చెందిన అన్ని వివరాలూ నమోదు చేసేలా ఈ కార్డు ఉండాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా చూడాలి. ఈ ఒక్క కార్డు ద్వారానే అన్ని వివరాలూ తెలిసేలా రూపొందించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశర చేశారు. రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా లేక్‌తో కుటుంబం, వ్యక్తుల వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలు, పౌరసేవల పర్యవేక్షణకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ ఒక్కటే ఉంటుందని తెలిపారు. కుటుంబ సాధికారిత కోసం ఈ వ్యవస్థను వినియోగిం చాలని చంద్రబాబు సూచించారు. కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు చేయాలని సీఎం పేర్కొన్నారు. స్టాటిక్ డేటా, డైనమిక్ డేటా వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చూడాలన్నారు. వాక్సినేషన్, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధృవీకరణ, పౌష్టికాహారం, రేషన్ కార్డు, స్కాలర్‌షిప్, పెన్షన్లు సహా వేర్వేరు ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన వివరాలన్నీ ఈ కార్డు ద్వారా ట్రాకింగ్ జరిగేలా చూడాలన్నారు. ఆధార్ సహా అన్ని వివరాలు ఈ ఒక్క కార్డు ద్వారానే తెలిసేలా రూపొందించాలని చెప్పారు.

## త్వరలోనే పంచాయితీ ఎన్నికలు

**రెండుమూడు రోజుల్లో నోటిఫికేషన్**
**కొడంగల్ పర్యటనలో సిఎం రేవంత్ వెల్లడి**


**కొడంగల్,**



:రాష్ట్రంలో త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునేవాళ్లను ఈ ఎన్నికల్లో ఎన్నుకోవద్దని సూచించారు. అభివృద్ధి చేసే వారికే అండగా నిలవండి అని కోరారు.సర్పంచ్ ఎన్నికలు అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యాన్ని మహిళలు ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ ఎన్నికల కోసం రాజకీయాలను పక్కనబెట్టాలని సూచించారు. అభివృద్ధి విషయంలో అంతా ఒక్కటే అని సంకేతమివ్వాలని సూచించారు. కొడంగల్‌లో పర్యటన సందర్భంగా అక్షయ పాత్ర కిచెన్‌కు సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేశారు. అలాగే రూ.103కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ప్లలె వెలుగు బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..రూ.5వేల కోట్లతో కొడంగల్‌లో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తామని.. రాష్ట్రం నలుమూలల నుంచి చదువు కోసం కొడంగల్‌కు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఢిల్లీకి నోయిడా తరహాలో కొడంగల్ మారబోతోందని పేర్కొన్నారు.

## గ్యాస్ ఛాంబర్‌లా ఢిల్లీ..

**సగం మంది ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హెూమ్..!**



**న్యూఢిల్లీ,**

దేశ రాజధాని ఢిల్లీలో రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం తీవ్రత, పెల్లుబికుతున్న నిరసనల దృష్ట్యా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చలికాలంలో నగరం గ్యాస్ ఛాంబర్‌లా మారిన వేళ ప్రైవేట్ కంపెనీలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హెూమ్ ఇవ్వాలని ఆదేశించింది. తమ ఉద్యోగుల్లో సగం మందిని ఇంటి నుంచే పని చేసేలా.. మిగతా సగం మంది ఆఫీసుకు వచ్చేలా చూడాలని ఆయా సంస్థలను కోరింది ప్రభుత్వం. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 లోని సెక్షన్ 5లో పేర్కొన్న నిబంధలన ప్రకారం పర్యావరణ శాఖ, అటవీ శాఖ ప్రైవేట్ కంపెనీలకు ఈ ఆదేశాలను జారీ చేసింది.ప్రస్తుతం ఢిల్లీలో గాలి నాణ్యత దారుణంగా పడిపోయింది. చలికాలంలో కాలుష్యం తీవ్రత ఆందోళన రేకెత్తిస్తోంది. PM2.5, PM10 నిర్ణీత మోతాదు కంటే ఎక్కువగా నమోదయ్యాయి. దాంతో, రేఖా గుప్తా నేతృత్వంలోని ప్రభుత్వం కాలుష్య నియంత్రణ చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే ప్రైవేట్ కంపెనీలు తమ ఉద్యోగుల్లో సగం మందికి వర్క్ ఫ్రమ్ హెూమ్ ఇవ్వాలని ఆదేశించింది. ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరిగా ఈ నియమాన్ని పాటించాలని సదరు సంస్థలకు ఢిల్లీ గవర్నమెంట్ తేల్చి చెప్పింది.

## పోలేపల్లి గ్రామంలో 'ఇందిరమ్మ మహిళా శక్తి' చీరల పంపిణీ



**దేవరకొండ నవంబర్ 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ మహిళా శక్తి పథకం పరిధిలో భాగంగా నల్లగొండ జిల్లా, చందంపేట మండలం, పోలేపల్లి గ్రామంలో అర్హత కలిగిన ప్రతి మహిళకు చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం గ్రామ పంచాయతీ భవనంలో నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళల సమక్షంలో ఎంతో ఉత్సాహంతో కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి ఎల్లయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి సైదులు, ఎన్ ఎస్ యు ఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పగిళ్ళ నరసింహ, నాగిళ్ల శ్రీను, నాగిళ్ల పరంకుశం, పానుగంటి శంకరయ్య ,గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొని మహిళలకు చీరలు అందజేశారు.

## నూతన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**హయత్ నగర్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మత్తు పానీయాలను అరికట్టి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. హయత్‌నగర్ కుంట్లూర్ రోడ్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన పెద్దఅంబర్‌పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఈరోజు ఉదయం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో శాంతి భద్రతలు కాపాడటానికి మత్తు పదార్థాల నియంత్రణ అత్యవసరమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తు దెబ్బతినకుండా ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ దశరథ, సూపరింటెండెంట్ ఉజ్వలారెడ్డి, అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్‌చైర్మన్ భాస్కర చారి, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## మద్దిమడుగు అంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం




**అమ్రాబాద్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమ్రాబాద్ మండలంలోని మద్దిమడుగులో శ్రీ పబ్బతి అంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 4 వరకు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఆహ్వానం అందజేసిన ఆలయ కమిటీ చైర్మన్ దేశవత్ రాములు నాయక్, ఈవో రంగచారి, SDE దేశవత్ చందు, అర్చకులు వీరయ్య శాస్త్రి గారితో కలిసి హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను శాలువా కప్పి సన్మానించారు.అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను కూడా సన్మానించి ఆహ్వానం పలికారు. మద్దిమడుగులో జరగబోయే బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# జెపి నగర్ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల జీవితాలతో చెలగాటం

### జెపి నగర్ సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థి సంఘాలు (ఏఐఎస్ఎఫ్, పి డి ఎస్ యు) ముట్టడించడం జరిగింది




**కల్వకుర్తి నవంబర్ 24. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
కల్వకుర్తి జే పి నగర్ లో గల సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు) వద్ద ఏఐఎస్ఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థిని గోపాల్ అనే ఉపాధ్యాయుడు అడిగిన సమాధానానికి జవాబు చెప్పలేదని తన ఇష్టం సారంగా 100 నుంచి 150 గుంజీలు తీయమని చెప్పడం జరిగింది. ఆ విద్యార్థి భయపడుతూ గుంజీలు తీసిన తర్వాత ఒక రెండు రోజులకు అబ్బాయి లేవనేని పరిస్థితిలో హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు, సమాచారం మేరకు విద్యార్థి చదువుతున్న పాఠశాలలకు విద్యార్థి సంఘాలు వెళ్లడం జరిగింది . సమాచారం అడిగి తెలుసుకోగా గోపాల్ అనే ఉపాధ్యాయుడు సైన్స్ పాఠం చెబుతాడు, గోపాల్ అనే వ్యక్తి చదువు చెప్పడం కూడా చేతకాదు తన ఇష్టానుసారంగా క్లాసులకు వచ్చి వెళ్ళిపోతాడు విద్యార్థులను ఇలాగనే ఇబ్బంది పెడుతున్నారని గతంలో భగత్ అనే విద్యార్థి ఉపాధ్యాయులకు చెప్పడం జరిగింది మా ఒక్క అబ్బాయి చాలా వీక్ ఉంటాడు ఇలాంటి ఇబ్బంది పెట్టొద్దని చెప్పిన సరే అలాగనే మల్ల రిపీట్ చేయడం జరిగింది. విద్యార్థి చాలా ఇబ్బంది పడుతూ ఇంటికి వెళ్లగా తల్లిదండ్రులతో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు, ఈ సమాచారం మేరకు ప్రిన్సిపల్ ని అడిగి తెలుసుకోగా గతంలో కూడా గోపాల్ పరిస్థితి ఇదే విధంగా ఉన్నది చదువు చెప్పడం చేతగలగాని విద్యార్థులతో దూరుసుగా ప్రవర్తిస్తూ తన ఇష్టానుసారంగా నడుచుకుంటున్నారని గతంలో రెండు మూడు సార్లు వార్నింగ్ కూడా ఇచ్చిన ఇలానే చేస్తుండు కాబట్టి ఈసారి తనని సస్పెండ్ చేస్తున్నామని వైస్ ప్రిన్సిపల్ చెప్పారు, ఇలాంటి ఘటనలు మళ్ళీ ఎప్పుడు జరగకుండా మేము ముందు జాగ్రత్త తీసుకుంటామని ఉపాధ్యాయులకు క్లాసెస్ తీసుకుంటామని ప్రిన్సిపల్ వాపోయారు, విద్యార్థి సంఘాలు ఇలాంటి ఘటనలు జరుగుతే ఊరుకుండే ప్రసక్తే లేదు అని తెలిసి చెప్పడం జరిగింది .ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పి డి ఎస్ యు స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సంతోష్, లక్ష్మణ్, అరవింద్, పృధ్వి, రామానుజన్, ప్రవీణ్ విద్యార్థి భరత్ ,తల్లిదండ్రులు ,కుటుంబ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# 'ఇందిరా మహిళా శక్తి' చీరల పంపిణీ



**అమ్రాబాద్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమ్రాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద 'ఇందిరా మహిళా శక్తి' పథకం కింద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సతీమణి, అమ్రాబాద్ మాజీ జెడ్పిటిసి డాక్టర్ అనురాధ పాల్గొని మహిళలకు చీరలను అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ అనురాధ మాట్లాడుతూ, తెలంగాణలోని కోటి మంది మహిళలకు కోటి చీరలను పంపిణీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని తెలిపారు. నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారని, డిసెంబర్ 9లోపు గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ పూర్తి చేసి, మార్చి 1, 2026 నుంచి మార్చి 8నాటికి పట్టణ ప్రాంతాల్లో పంపిణీ ముగించనున్నట్లు వివరించారు.రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లోని చేనేత కార్మికుల సంఘాలు ఈ చీరలను తయారు చేస్తున్నాయని, దీంతో స్థానిక చేనేత పరిశ్రమకు ఉపాధి లభిస్తోందని ఆమె పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఆధార్ కార్డు ఆధారంగా చీరలు అందజేస్తూ, మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఇతర పథకాలలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాలకు జీరో వడ్డీ రుణాలు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు కేటాయింపు, 'ఇందిరా మహిళా శక్తి మండల సమైక్య' పేరుతో బస్సుల కొనుగోలుకు ఆర్థిక సహాయం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకంలో ఆడబిడ్డల పేరుతో రూ.5 లక్షల సహాయం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో మహిళలకు సహకారం అందిస్తామని డాక్టర్ అనురాధ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతల గోపాల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరి నారాయణ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు వెంకటయ్య, మాజీ వైస్ ఎంపీపీ శంభో శోభ, మాజీ సర్పంచ్ భ్రమరాంబ, డిప్యూటీ సర్పంచ్ రఘు చారి, రేనయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళా సమైక్య అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పోతోందని ఆవేదన వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**జమ్మికుంట, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సూదులు, మందులు, దూది కూడా అందుబాటులో లేకపోవడం ప్రజల్లో నమ్మకం కోల్పోయే పరిస్థితి తెచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని సరిగా వినియోగించలేకపోయిందని ఆయన విమర్శించారు. జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన, కోటి రూపాయల విలువైన ఆధునాతన వైద్య పరికరాలను అందజేశారు. త్వరలోనే ఎక్స్‌రే మిషన్‌ను కూడా అందజేస్తానని తెలిపారు. పరికరాలను వినియోగించకుంటే వాపస్ తీసుకుంటానని స్పష్టంచేశారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణంపై మాట్లాడుతూ కమీషన్ల కోసం నాసిరకంగా పనులు చేసి అవి కూలిపోతున్నాయని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. జమ్మికుంటలో స్పోర్ట్స్ స్టేడియం, రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్‌లో పత్తి రైతులు ఆయనను కలిసి కొనుగోలు పరిమాణాన్ని 7 నుండి 9 క్వింటాళ్లకు పెంచాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై సీసీఐ అధికారులతో మాట్లాడతానని మంత్రి హామీ ఇచ్చారు. ఇటీవల వర్షాలతో పంట నష్టపోయిన రైతు తారవ్వకు ఆయన ముందే రూ.50 వేల సాయం అందజేసిన విషయాన్ని గుర్తుచేసి, పేద రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## జ్యోతిస్మతి ఇంజనీరింగ్ కాలేజీ కబ్జా చేసిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్



**కరీంనగర్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ రెవెన్యూ గ్రామ పరిధిలో జ్యోతిస్మతి ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం కబ్జా చేసిన అసైన్డ్ భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ కోరింది. కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టి వినతిపత్రం సమర్పించిన అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌కు పిర్యాదు అందజేశారు. ఏఎఫ్‌బి నాయకులు మాట్లాడుతూ, 2007లోనే తహసిల్దార్ సర్క్యులర్ ద్వారా ఆ భూమి ప్రభుత్వానికి చెందుతుందని స్పష్టమైనప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కోర్టుల్లో కూడా కేసులు కొట్టి వేసిన తర్వాత భూమి ప్రభుత్వానికి చెందుతుందని తేలినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. జ్యోతిస్మతి యాజమాన్యం కబ్జా చేసిన 19 ఎకరాల భూమి విలువ దాదాపు 70 కోట్ల రూపాయలుగా ఉంటుందని, రెవిన్యూ అధికారులు స్టే ఉన్నట్లు చెబుతున్నా దానికి ఆధారాలు చూపలేకపోతున్నారని అన్నారు. భూమిని తిరిగి నిరుపేదలకు కేటాయించాలా లేదా ప్రజా అవసరాల కోసం వినియోగించాలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కమిటీ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

**కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**



**కడ్తాల్, నవంబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** సమాజ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల యొక్క పనితీరు వెలకట్టలేనిదని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలో మహిళా అభ్యున్నతికి అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకు బాలచంద్ర స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 3 నెలల ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన సుమారు 40 మంది మహిళలు ప్రదర్శించిన వృత్తి నైపుణ్య ముగింపు కార్యక్రమంలో లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా స్వయం సమృద్ధి వైపు ప్రోత్సహించే దిశగా స్వచ్ఛంద సేవా సంస్థల పనితీరు అభినందనీయమని అన్నారు. నిరుపేద మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తున్న అభయ ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా తన సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తోందని, వారి సేవలు అభినందనీయమని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు ప్రాథమిక కుట్టు నైపుణ్యాల నుండి అడ్వాన్స్డ్ టైలరింగ్ టెక్నిక్స్ వరకు ఆచరణాత్మకమైన శిక్షణ అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు మూడు నెలల పాటు శిక్షణ పొంది నేర్చుకున్న పనితీరును మరియు కుట్టిన వస్త్రాలను పరిశీలించి అభినందించారు. శిక్షణను పూర్తి చేసిన తరువాత, మహిళలు స్వంతంగా చిన్న వ్యాపారం ప్రారంభించేందుకు సహాయపడాలన్న ఉద్దేశంతో సంస్థ సబ్సిడీపై అందించిన 36 కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అనంతరం లక్ష్మీ నరసింహ్మా రెడ్డి మాట్లాడుతూ,

మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అందుకే స్వయం ఉపాధిని ప్రోత్సహించే ఈ ప్రాజెక్టులను నిరంతరం కొనసాగించడానికి ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కుట్టు మిషన్లను అందుకున్న మహిళలు అభయ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేసినట్లు అన్నారు. సామాజిక సేవలో అడుగడుగునా కొత్త కార్యక్రమాలతో స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సేవలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ప్రశంసలు పొందుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అభయ ఫౌండేషన్ ఉమెన్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ కృష్ణవేణి, కోఆర్డినేటర్ మంగ, టైలరింగ్ శిక్షకురాలు విజయ, కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్ బాబా మరియు స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి ఘన సన్మానం



**అమ్రాబాద్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్** నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మూడోసారి నియమితులైన డాక్టర్ వంశీకృష్ణకు అమ్రాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతం కోసం ఆయన కృషి కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు హరి నారాయణ, బాల్ లింగం గౌడ్, మాజీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు, కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహీం, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్, సురేష్, ఏలియా, అహ్మద్ గౌస్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.


# ఆధ్యాత్మికంగా అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన ముద్విన్, మైసిగండి గ్రామాలు

**అయ్యప్ప స్వామి 18వ మెట్టు మహా పడిపూజలో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ సర్పంచ్ ఎల్ ఎన్ రెడ్డిలు**



**కడ్తాల్, నవంబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** మనుషులకు ఉన్న స్వార్థం వీడితే సంతోషం రెట్టింపు అవుతుందని డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. సోమవారం కడ్తాల మండలంలోని ముద్విన్, మైసిగండి గ్రామాలు ఆధ్యాత్మికత శోభను సంతరించుకున్నాయి. ముద్విన్ గ్రామంలో ఉన్న శ్రీ రామాలయంలో డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ముద్విన్ గ్రామంలో పట్నం శ్రీను గౌడ్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి 18వ మెట్టు మహా పడిపూజ బ్రహ్మశ్రీ కుట్టన్ చంద్రమోహన్ నాయర్ గురుస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మైసిగండి శివాలయంలో కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ బి. ఆనంద్ ఆధ్వర్యంలో ముకుంద గురుస్వామి ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి ఇరుముడి మహా పూజలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రెండు గ్రామాలు అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి.. అనంతరం గంప వెంకటేష్ గుప్తా, గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి అన్న ప్రసాదం ( బిక్ష) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు భీముడు, శ్రీశైలం, సైదులు, విజయ్, పి రామకృష్ణ, వెంకటేష్, నరేష్, మాదారం మహేష్ గౌడ్, మహేందర్ గౌడ్, గురు స్వామి నరసింహ గౌడ్ స్వామి, రమేష్ గౌడ్, నరసింహా గౌడ్, సురేష్ ముదిరాజ్, సన్నిధానం గురు స్వామి, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి గురుస్వామి, కే సత్యంచారి, శ్రీకాంత్, అమృతం పాండు స్వామి, ఆంజనేయులు, లాయక్ అలీ, జహంగీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.


# ఇప్పలపల్లి ఇందిరమ్మ ఇళ్లపై ప్రజావాణిలో ఫిర్యాదు




**పెద్దపల్లి, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకుడు ఉమ్మల్ల రాజేందర్ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అక్రమాలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ప్రజావాణిని ఆశ్రయించాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ఏ విధంగా జరిగింది, ఏ ఆధారాలను అనుసరించి, ఏ తీర్మానం ప్రకారం ఎంపిక చేశారో తెలియజేయాలని సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

ఇప్పటికైనా జిల్లా అధికారులు ఈ విషయంపై తక్షణమే విచారణ జరిపి అసలైన అర్హులకు న్యాయం చేసే విధంగా గ్రామంలో రీ-సర్వే చేయించి ఇళ్లు కేటాయించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున రాజేందర్ డిమాండ్ చేశారు.

# హుస్నాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అవినీతి ఆరోపణలపై కలెక్టర్ ప్రజావాణిలో ఫిర్యాదు





Prajavani Acknowledgement Receipt

Name:K.Venugopal Reddy
Mobile No. : 9494993480
Address:Husnabad,Husnabad,Husnabad
Village:HUSNABAD
Mandal:HUSNABAD
Grievance Subject:Requests

Your Grievance is Registered vide Registration no.HSBDNP/E/2025/00015 On24-11-2025Please keep the registration number for all future correspondence. Your Grievance is sent to MUNICIPAL COMMISSIONER HUSNABAD

**హుస్నాబాద్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న అధికారి అవినీతిపైన విజిలెన్స్ మరియు శాఖా పరమైన దర్యాప్తు జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇంచార్జ్ వేణుగోపాల్ రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. వేణుగోపాల్ రెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, టౌన్ ప్లానింగ్ అధికారి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు, సెట్‌బ్యాక్ లేకుండా కట్టిన బహుళ అంతస్తుల భవనాలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, వ్యాపారుల వద్ద నుండి లక్షల రూపాయలు స్వీకరించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలకు పర్మిషన్లు ఇవ్వడం, ప్రభుత్వ భూములపై పాత పర్మిషన్ల ఆధారంగా కొత్త అనుమతులు మంజూరు చేయడం, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అండదండలుగా వ్యవహరించడం, నాలా లేకుండా, లేఔట్ లేకుండా భవనాలకు అనుమతులు ఇవ్వడం వంటి అవకతవకలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఫిర్యాదులో, అక్రమంగా కట్టిన ఇండ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి 50 వేల నుండి లక్ష రూపాయలు డిమాండ్ చేస్తున్నారని కూడా పేర్కొన్నారు. ఈ అవినీతి కారణంగా హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం పూర్తిగా అవినీతిమయంగా మారిందని వేణుగోపాల్ రెడ్డి ఆరోపించారు. ఈ అంశాలపై విజిలెన్స్ మరియు శాఖా పరమైన దర్యాప్తు జరిపించి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విచారణ జరగకపోతే ప్రజా సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజావాజ్యమియందు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# హలో మాల - చలో ఢిల్లీ




**హుస్నాబాద్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఈ నెల 25, 26 తేదీలలో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో రాజ్యాంగ హక్కుల సాధన సభ జరగనుంది. రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పర్యవేక్షణలో జరిగే ఈ సభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుండి మాల మహానాడు నాయకులు బయలుదేరారు. నియోజకవర్గ ఇన్చార్జ్ ఆరె కిశోర్, జిల్లా మీడియా ఇంచార్జ్ జాల శ్రీనివాస్, సుంకే రమేష్, డ్యాగల సతీష్, మహేందర్, వేరంగి సాయి పరమేష్, బురికి జాల రాజయ్యతో కలిసి వెన్న రాజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీకి చేరుకున్నారు.

# పాక్ పారా మిలిటరీ ప్రధాన కార్యాలయంపై ఆత్మాహుతి దాడి



**న్యూఢిల్లీ- నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పాకిస్థాన్‌లో ముష్కరులు రెచ్చిపోయారు. పెషావర్ (లోని పాక్ పారామిలిటరీ ప్రధాన కార్యాలయం పై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు కమాండోలు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. సోమవారం తెల్లవారుజామున పెషావర్‌లోని ఫ్రంటియర్ కోర్ ప్రధాన కార్యాలయంపై ఇద్దరు ఆత్మాహుతి బాంబర్లు దాడి చేసినట్లు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. ఆ కార్యాలయాన్ని ముట్టడించిన ముష్కరులు వరుస దాడులు చేశారు. దీంతో అప్రమత్తమైన పారామిలిటరీ సిబ్బంది వారిపై కాల్పులు జరిపారు. ఈ ఎదురు కాల్పుల్లో ముగ్గురు కమాండోలు మరణించారు. పలువురు గాయపడ్డారు. ప్రస్తుతం అక్కడ ఆపరేషన్ కొనసాగుతోంది. ప్రధాన కార్యాలయంలోపల కొంతమంది ఉగ్రవాదులు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. దీంతో భద్రతా బలగాలు, స్క్వాడ్ బృందాలు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకొని తనిఖీలు చేపట్టాయి.

# నిరుద్యోగ యువతకు మంచి అవకాశం

- హుస్నాబాద్ ప్రభుత్వ కళాశాలలో ఉచిత టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ శిక్షణ




**హుస్నాబాద్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈడి సెల్ ఆధ్వర్యంలో, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వరంగల్ సహకారంతో నిరుద్యోగ యువతీ యువకులకు 50 రోజుల పాటు ఉచిత టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ శిక్షణను అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయగిరి బిక్షపతి తెలిపారు. ఇది పూర్తిస్థాయి రెసిడెన్షియల్ శిక్షణ అని, శిక్షణా కాలంలో ఉచిత భోజన వసతి, హాస్టల్ సౌకర్యం కల్పించబడుతుందని ఆయన వివరించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వ సంస్థ జాతీయ నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ ఎస్ డి సి) ద్వారా సర్టిఫికెట్ ఇవ్వబడుతుందని, ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించబడతాయని తెలిపారు. 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ బి. నైయనాదేవిని 9440709807 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. నమోదు చేసుకున్న అభ్యర్థులతో మొదటి బ్యాచ్ శిక్షణా కార్యక్రమం డిసెంబర్ 1వ తేదీ నుండి హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమవుతుందని ప్రిన్సిపల్ తెలిపారు.

## ఆకస్మికంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**హుస్నాబాద్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలో ఉన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. సెంటర్‌లో ఇప్పటివరకు సుమారు రెండు వేల క్వింటాల వరి ధాన్యం కొనుగోలు జరిగిందని, అక్కడి నుండి లోడ్ చేసిన ధాన్యం శ్రీనిధి మిల్లు నంగునూరుకు తరలిస్తున్నట్లు సిబ్బంది వివరించారు. కలెక్టర్ కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత ఉండాలని సూచిస్తూ, ప్రతి రోజు లోడ్ అయిన వెంటనే ట్రక్ షీట్ జెనరేట్ చేయాలని ఆదేశించారు. అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు రాత్రి వేళల్లో టార్పలిన్ కవర్లు ఉపయోగించి ధాన్యాన్ని రక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు మరియు చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా, తేమ శాతం రాగానే గన్నీలలో నింపి వెంటనే లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

## కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 26న ధర్నా




**హుస్నాబాద్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 26న జిల్లా కేంద్రంలో జరగనున్న ధర్నా ప్రదర్శనను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ముకుంద లాల్ మిశ్రా భవనంలో జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తామని, మద్దతు ధర చట్టం తీసుకువస్తామని కేంద్రం ఇచ్చిన హామీ మూడు సంవత్సరాలైనా నెరవేరలేదని విమర్శించారు. కొత్త వ్యవసాయ ముసాయిదా చట్టం పేరుతో మార్కెట్లను రద్దు చేసి కార్పొరేట్ శక్తులకు రైతుల భూములను అప్పగించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. పత్తి కొనుగోలు పరిమితి తగ్గించడం, కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బలవంతపెట్టడం రైతులకు ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు. కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి హక్కులను తగ్గించడం, ఉపాధి హామీ నిధులను కోత పెట్టడం వంటి చర్యలు ప్రజా వ్యతిరేకమని అన్నారు. ఈ విధానాలకు నిరసనగా నవంబర్ 26న జరగనున్న రైతు, కార్మిక ప్రదర్శనలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం





### మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

**పెద్దపల్లి, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. పెద్దపల్లి పట్టణంలోని స్వరూప గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళలకు నాణ్యమైన చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు రవాణా, వడ్డీ లేని రుణాలు, పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక పాలసీలు, పేద కుటుంబాల మహిళలకు ఉచిత విద్యుత్, తక్కువ ధరలో గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. 2047 తెలంగాణ రైసింగ్ పాలసీ లో భాగంగా మహిళా పారిశ్రామిక వేత్తలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పెద్దపల్లి జిల్లాలో ఇప్పటికే 9 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు విడుదల చేశామని, ఈ సంవత్సరం మరో 10 కోట్ల రూపాయలు విడుదల చేయనున్నామని వెల్లడించారు. మహిళలకు నాణ్యమైన చీరలను అందించడమే లక్ష్యమని, రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకు చీరలు పంపిణీ చేస్తామని తెలిపారు. రైతుల కోసం పంట రుణమాఫీ, పెట్టుబడి సహాయం, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచామని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టామని వివరించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మొదటి విడతలో గ్రామీణ ప్రాంతాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని, పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా లక్షా 20 వేల చీరలు అందజేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ గతంలో నాసిరకం చీరలు పంపిణీ చేసి మహిళలను అవమానపరిచారని, ప్రస్తుత ప్రభుత్వం నాణ్యమైన చీరలు అందజేస్తోందని అన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ మహిళా సంఘాలకు లక్ష కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందజేస్తూ చిన్న, కుటీర పరిశ్రమల స్థాపనలో మహిళలు ముందుండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, ఆర్డీఓ గంగయ్య, గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, తహసిల్దార్, ఎంపిడిఓ, ప్రజా ప్రతినిధులు, మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## సిద్దిపేట ప్రజావాణిలో కీలక సూచనలు చేసిన జిల్లా కలెక్టర్



**సిద్దిపేట, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సోమవారం ఉదయం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి వివిధ శాఖల అధికారులకు కీలక సూచనలు చేశారు. అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులకు అవగాహన కల్పించాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నందున ఏర్పాట్లను ఇప్పటి నుంచే పూర్తి చేయాలని సూచించారు. అంగన్వాడీ, గ్రామపంచాయితీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వెంటనే ప్రారంభించి అర్హులైన వారికి ప్రయోజనం చేకూరేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తరువాత ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి, అర్హతల మేరకు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మొత్తం 123 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించిన జిల్లా కలెక్టర్





**మంచిర్యాల, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మంచిర్యాల జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరా మహిళా శక్తి భవన్, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం ఆయన పాత మంచిర్యాల ప్రాంతంలో నిర్మాణ పనులను పరిశీలించి, మహిళల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అనంతరం కాలేజ్ రోడ్డులో జరుగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. తరువాత నస్పూర్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ప్రజలు సమర్పించిన వినతులను కలెక్టర్ స్వీకరించి, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మొత్తం 123 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రామగుండం కాంగ్రెస్ వైపు భారీ వలసలు

అభివృద్ధి పట్ల ప్రజల నమ్మకం పెరుగుతోంది



**రామగుండం, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్గాం మండలంలో కాంగ్రెస్ పార్టీ శక్తి రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ నాయకుడు తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో టిటిఎస్ అంతర్గాంకు చెందిన తెరాస, బీజేపీ పార్టీలలో పనిచేసిన దాదాపు వందమంది మహిళలు, యువకులు పార్టీ మార్పు నిర్ణయం తీసుకుని కాంగ్రెస్ కండువా ధరించారు. వారందరికీ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్వయంగా కండువాలు కప్పి కాంగ్రెస్ కుటుంబంలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గ అభివృద్ధే తమ ధ్యేయమని, రోడ్లు, కాలనీలు, డ్రైనేజీలు, గృహ సమస్యలు, విద్యుత్ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేస్తోందని తెలిపారు. అభివృద్ధి పట్ల ప్రజల్లో నమ్మకం పెరుగుతుండడంతో కాంగ్రెస్ వైపు వలసలు రావడం మంచి సంకేతమని అన్నారు. రానున్న సర్పంచ్, పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త గ్రామాల్లోకి వెళ్లి ప్రజలతో కలిసిపని చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్పొరేషన్ నాయకులు, ఎన్నికల పరిశీలకులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు పరిమాణం పెంచాలని రైతుల వినతి

**హుస్నాబాద్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పత్తి దిగుబడి తగ్గిపోవడంతో కొనుగోలు పరిమాణాన్ని ఎకరాకు 7 క్వింటాళ్ల నుండి 9 క్వింటాళ్లకు పెంచాలని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ రైతులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కోరారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చిన ఆయనకు వినతిపత్రం అందజేశారు. వాతావరణ సమస్యలు, నీటి కొరత, మార్కెట్ అస్థిరత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ నిర్ణయించిన పరిమాణం వల్ల నష్టపోతున్నామని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన బండి సంజయ్, ఈ విషయాన్ని సీసీఐ అధికారులు, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఇటీవల వర్షాలతో పంట నష్టపోయిన రైతు తారవ్వను ఆయన కలిశారు. ముందే ఢిల్లీ నుండి ఫోన్ చేసి ధైర్యం చెప్పి రూ.50 వేల సాయం పంపించిన విషయాన్ని గుర్తుచేసుకున్న తారవ్వ, "సంజయన్నా దేవుడిచ్చిన అన్నవు. మీ సాయం జన్మలో మర్చిపోలేను" అని కృతజ్ఞతలు తెలిపింది.

## రైస్ మిల్లర్లు వెంటనే వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్



**కరీంనగర్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, రైతులను ఇబ్బంది పెడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర నష్టపోయారని, చేతికి వచ్చిన ధాన్యాన్ని విక్రయించేందుకు కేంద్రాలకు తీసుకెళ్తే మిల్లర్లు కోటా అయిపోయిందని సాకులు చెబుతూ కొనుగోలు నిలిపివేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నూక, నల్ల గింజలు ఉన్నాయని పేరుతో బస్తాలకు కటింగ్ పెట్టడం వల్ల రైతులు మరింత నష్టపోతున్నారని తెలిపారు. జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు చెకుముకి పోటీలలో ప్రథమ స్థానం



**కరీంనగర్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు మండల స్థాయి చెకుముకి పోటీలలో ప్రథమ స్థానం సాధించారు. ఈ విజయంపై విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, సైన్స్ విషయాలను సమగ్రంగా అర్థం చేసుకోవడం వలన విద్యార్థులు కొత్త ఆవిష్కరణలకు దారితీస్తారని, పోటీ పరీక్షల్లో రాణించగలరని అన్నారు. మండల స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులు ఒంటెల శివ స్మరణ్ రెడ్డి, ఎస్. రిశాల్, కే. ఓం కార్తికేయ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లాకు జాతీయస్థాయి గుర్తింపు

### కలెక్టర్ కృషి ప్రశంసనీయం



**మంచిర్యాల, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ జల పురస్కారాలలో మంచిర్యాల జిల్లా జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మహిళా సంఘాల సభ్యులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. జాతీయస్థాయి పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మంచిర్యాల జిల్లా, అవార్డుతో పాటు రెండు కోట్ల రూపాయల నగదు పురస్కారాన్ని అందుకుంది. జిల్లాకు ఈ గౌరవం రావడంలో కలెక్టర్ కృషి అభినందనీయం అని వారు పేర్కొన్నారు.

## నాసిరకం పనుల వల్ల చెక్ డ్యామ్ కూలిందని ఎమ్మెల్యే



**పెద్దపల్లి, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఓదెల మండలం గుంపుల గ్రామంలో మానేరుపై నిర్మించిన చెక్ డ్యామ్ కూలిన ఘటనను పరిశీలించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, ఇది నాసిరక నిర్మాణం వల్లే జరిగిందని అన్నారు. బ్లాస్టింగ్ జరగలేదని అధికారులు కూడా స్పష్టత ఇచ్చారని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మిర్జంపేట, గుంపుల, ఇందుర్తి, రూపు నారాయణపేట, పోత్కపల్లి, కొండపాక, మడక కనగర్తి, తొగర్రాయి, నీరుకుల్ల ప్రాంతాల్లో నిర్మించిన చెక్ డ్యాములు నాణ్యత లేకపోవడంతో కుప్పకూలాయని ఆయన విమర్శించారు. హుస్సేన్ మియా వాగుపై నిర్మించిన చెక్ డ్యాములు కూడా ఇదే కారణంగా కూలిపోయాయని అన్నారు. అప్పటి నాయకులు కమీషన్ల కోసం నాణ్యత లేకుండా పనులు చేయించారని, 10 చెక్ డ్యాములు కడితే 8 ఇప్పటికే కూలిపోయాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లోపం, నాయకుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో అయ్యప్పస్వామి మహా పడిపూజ

**కరీంనగర్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో నవంబర్ 26న శ్రీ అయ్యప్పస్వామి మహా పడిపూజ వైభవంగా జరగనుంది. విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దైవ కార్యక్రమాలు చేయడం వలన సంతృప్తి కలుగుతుందని, భగవంతుని ఆశీస్సులు లభిస్తాయని తెలిపారు. అయ్యప్ప దీక్షాపరులు విధిగా పడిపూజ నిర్వహిస్తారని, ఇది స్వామివారికి మహాభిషేకంగా భావిస్తారని అన్నారు. పడిపూజ మహోత్సవానికి ప్రత్యేకత, మహిమ ఉన్నదని, దీక్షాపరులు 41 రోజుల పాటు అయ్యప్ప నామస్మరణ చేసి ఆరోగ్యంగా ఉండాలని, సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పూజ అనంతరం విచ్చేసిన వారికి అల్పాహారం విందు ఉంటుందని, స్వామివారికి పూలతో, ఫలాలతో, పంచామృతాలతో పుష్పాభిషేకం, పాలాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు దీక్షాపరులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు బీమా పెంపు



**మంచిర్యాల, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికులకు సంబంధించిన బీమా మొత్తాన్ని పెంచినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో బీమా పెంపు సంబంధిత గోడ ప్రతులు, కరపత్రాలను విడుదల చేశారు. కార్మికులకు ప్రమాద బీమా క్రింద లబ్ధి మొత్తాన్ని 6 లక్షల రూపాయల నుండి 10 లక్షలకు, సహజ మరణం క్రింద లబ్ధి మొత్తాన్ని 1 లక్ష నుండి 2 లక్షలకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. ప్రమాదవశాత్తు పూర్తి శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి 5 లక్షలు, పాక్షిక శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి 4 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించబడుతుందని తెలిపారు. డిసెంబర్ 3 వరకు మండలాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించి కార్మికులకు ప్రమాద బీమా అవసరాన్ని వివరించనున్నట్లు చెప్పారు. అర్హులైన వారు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సర్కారీ ఆసుపత్రులకు బండి సంజయ్ సాయం

### - రూ.4 కోట్ల విలువైన వైద్య పరికరాల అందజేత





**హుజూరాబాద్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులపై భారం పడకుండా ఉచితంగా వైద్యం అందించాలని వైద్యులను కోరుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక సూచనలు చేశారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ఆయన జమ్మికుంట ఏరియా ఆసుపత్రిని సందర్శించి, దాదాపు కోటి రూపాయల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను అందజేశారు. ఈసీజీ, అల్ట్రాసౌండ్, మల్టిపురా మానిటర్, ఆటోక్లేవ్, అనెస్థిషియా వర్క్ స్టేషన్, ఫెటల్ మానిటర్ సహా 15 పరికరాలను ప్రారంభించారు. తరువాత హుజూరాబాద్, హుస్నాబాద్ ఆసుపత్రులను కూడా సందర్శించి ఒక్కో ఆసుపత్రికి కోటి రూపాయల పరికరాలను అందజేశారు. వేములవాడలో ఇప్పటికే రూ.1.5 కోట్ల వ్యయంతో 16 పరికరాలను అందించిన ఆయన, గతంలో కరీంనగర్ జిల్లా ఆసుపత్రికి రూ.3 కోట్ల విలువైన అంబులెన్సులు, ఎక్స్‌రే మిషన్ అందించిన విషయం తెలిసిందే. సొంత నిధులు, సీఎస్సార్ ఫండ్స్‌తో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు. పేదలకు రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందించడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని సూచించిన అదనపు కలెక్టర్



**కరీంనగర్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్‌తో కలిసి ప్రజల వినతులను స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 352 దరఖాస్తులు అందగా, వీటిలో నగరపాలికకు 67, హౌసింగ్ శాఖకు 74 దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యుల అంజన్ కుమార్‌కు అభినందనలు




**కరీంనగర్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా నియమితులైన వైద్యుల అంజన్ కుమార్‌ను అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ నాయకులు అభినందించారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ 137ఏ లీడర్స్ కలిసి ఆయనను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే అసోసియేషన్ చేపట్టే సేవా కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, వైద్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## గోశాలల కోసం గోరక్షకుల ఉద్యమం

**కరీంనగర్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలోని వివిధ మండలాల్లో గోవులు విచ్చలవిడిగా తిరుగుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని గోరక్షకులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పగటిపూట రోడ్లపై విడిచిపెట్టి రాత్రివేళ దొడ్లలోకి చేర్చుతున్నా, కొన్ని గోవులు రాత్రింబగళ్లు రోడ్లపై సంచరిస్తున్నాయని తెలిపారు. కొంతమంది వాటిని కోతకు పంపించి అక్రమంగా లాభాలు పొందుతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గోవులను గోశాలలకు తరలించి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తక్షణమే గోశాలలు ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులు వెంటనే స్పందించి మండలాల వారీగా గోశాలలు ఏర్పాటు చేయాలని గోరక్షకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ కార్యదర్శి పూనం మల్లేష్, గోరక్ష ప్రముఖుడు దేవులపల్లి నవీన్, తిరునగిరి జయకర్, నిరూప్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# రామాలయ భూములను కాపాడాలని వినతి



**కరీంనగర్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొత్తపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సచ్చిదానంద ఆశ్రమం రామాలయానికి చెందిన భూములు ప్రైవేట్ విద్యాసంస్థలకు లీజుకు ఇచ్చిన విషయం వెలుగులోకి రావడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయానికి సంబంధించిన ప్రభుత్వ భూములను కబ్జాదారులు ఆక్రమిస్తున్నారని, అధికారులు కందకం తీయగా కొందరు దానిని పూడ్చివేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో రామాలయ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేసి భూమిని కాపాడాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పక్కన ఉన్న కుంట శిఖం భూమికి కూడా హద్దులు ఏర్పాటు చేసి, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కందకం పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రాన్ని జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ సమర్పించారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితిపై బండి సంజయ్ ఆవేదన



**హుస్నాబాద్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటుకు కూడా మందు అందుబాటులో లేకపోవడం పేద, మధ్యతరగతి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. సర్కార్ ఆసుపత్రులకు వచ్చే వారు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని పేదలు, మధ్యతరగతి ప్రజలేనని, సూది మందులు, కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల వారి పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన, ఎన్ఎండీసీ సంస్థ సహకారంతో సీఎస్సార్ నిధుల ద్వారా దాదాపు కోటి రూపాయల విలువైన ఆధునిక వైద్య పరికరాలను అందజేశారు. ఈసీజీ, అల్ట్రాసౌండ్, ఈఎన్టీ సర్జికల్ మైక్రోస్కోప్, మల్టిపుల్ మానిటర్లు, మార్చురీ కేబినెట్ సహా 15 రకాల పరికరాలను ప్రారంభించారు. రోగులను కలసి సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలు ఆర్థికంగా బలహీనులని గుర్తుంచుకుని, ఇకపై ఒక్క రోగి కూడా చికిత్స కోసం బయటకు వెళ్లే పరిస్థితి రాకూడదని ఆయన స్పష్టం చేశారు. "పేదలకు సేవ చేయడం మహాభాగ్యం, మానవ సేవే మాధవ సేవ" అని డాక్టర్లను కోరారు.

# జాతీయస్థాయి చెస్ పోటీలకు జీనియస్ అకాడమీ క్రీడాకారులు



**కరీంనగర్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన అండర్ 19 ఎస్‌జిఎఫ్ చదరంగం పోటీల్లో కరీంనగర్‌కు చెందిన జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ తెలిపారు. బాలుర విభాగంలో సుప్రీత్, సాత్విక్, బాలికల విభాగంలో శ్లోకయుక్తి, జి. మేఘసంహిత ఎంపికై, వచ్చే నెలలో కర్ణాటకలో జరగబోయే జాతీయ పోటీల్లో తెలంగాణ తరఫున ఆడనున్నారు. ఎంపికైన క్రీడాకారులను జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు కంకటి కనకయ్య, కోఆర్డినేటర్ సృజన్ కుమార్, కోచ్‌లు అనూష్, అభిరామ్, రేవిక్, అరుణ్ ప్రభు, శ్రీనిజ, స్వాతి, సిరి మేఘన, వరుణ్ తదితరులు అభినందించారు.

# ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన

**కాంగ్రెస్ కిసాన్ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షుడు అర్కోటం బాల్ రాజ్**



**కడ్తాల్, నవంబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు సోమవారం ఇందిరమ్మ కమిటీ చైర్మన్, కడ్తాల్ మండల కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు అర్కోటం బాల్ రాజ్ పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కళ నెరవేర్చలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా సహకారంతో గ్రామానికి రెండో విడుతలో మరిన్ని ఇండ్లు తీసుకొస్తున్నట్లు బాల్ రాజ్ వెల్లడించారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

# మహిళల అభివృద్దే ప్రజా ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి





**ఇబ్రహింపట్నం నవంబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లా పూర్ మెట్ మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళ లకు ఇందిరమ్మచీరలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి . ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశ్యంలో వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, మహిళల పేర్ల మీదనే ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నాని స్పష్టంచేశారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత


**మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ.**



**ఎలిగేడు, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని , దూళికట్ట గ్రామాల్లో బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కోఆర్డినేటర్ దయ అరుణ, జెండర్ స్పెషలిస్ట్ సుచరిత మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం మరియు ప్రోత్సహించడం చట్టారీత్యా నేరమని బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాల్య వివాహ నిషేధ చట్టం 2006 గురించి వివరిస్తూ ఆడపిల్ల వయసు 18 సంవత్సరాలు నిండకముందే పెళ్లి చేసుకున్నట్లయితే వాటి వల్ల కలిగే మానసిక శారీరక ఆర్థిక అనర్థాలు వివరించడం జరిగింది. ఒక ఆడపిల్ల పుట్టడం బ్రతకడం ఎదగడం చదవడం దాని యొక్క నినాదాన్ని పిల్లల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కళ కళాకారులు ఢిల్లీ, కాసిపేట అశోక్, మండలంలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలి

**మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**



**కడ్తాల్, నవంబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలని భక్తి భావంతో మెలగాలని కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్, ఎల్ హెచ్ పి హెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ అన్నారు. సోమవారం కడ్తాల్ మండలంలోని మైసిగండి శివాలయంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇరుముడి కార్యక్రమానికి స్థానిక నాయకులతో కలిసి జైపాల్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావంతో వెలిగినప్పుడే ధర్మం నిలబడుతుందని తెలిపారు. ధర్మాన్ని పాటించేవారు తప్పనిసరిగా భక్తి భావంతోనే మెలుగుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జైపాల్ నాయక్,మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, భిక్య నాయక్ మాజీ ఎంపిటిసి ప్రియా రమేష్,నాయకులు పాండు నాయక్,భిక్య నాయక్, రాజు, జానియా, జగన్ నాయక్,నాగార్జున, అయ్యప్ప స్వాములు,ఆంజనేయ స్వాములు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కు ఘన స్వాగతం



**కడ్తాల్, నవంబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు కు బిజెపి మండల అధ్యక్షులు దోనాదుల మహేష్ ఆధ్వర్యంలో పూలమాలలతో స్వాగతం పలికి శాలువాలతో సన్మానించి స్వాగతం పలకడం జరిగింది. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం పోరాడిన మహావీరుడైన భగవాన్ శ్రీ బిర్సా ముండా 150వ జయంతి నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బౌరపురం చెంచు పెంట గ్రామంలో జయంతి ఉత్సవానికి ముఖ్య అతిథి గా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు - శ్రీ రామచంద్ర రావు, డాక్టర్ గువ్వల బాలరాజు, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రవి నాయక్ పాల్గొన్నారు. కడ్తాల్ మీదుగా వెళ్తున్న సందర్భంగా వారికీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్టి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి లాల్ నాయక్,బిజెపి మండల మాజీ అధ్యక్షులు మన్యా నాయక్,బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీశైలం గౌడ్, భగీరథ,శంకర్ నాయక్, రెడ్యానాయక్,సిద్ధిగారి కుమార్,తుప్పరి శీను, రవీందర్ రెడ్డి,జంగం వెంకటేష్, పొగాకు వెంకటేష్,సాయి ప్రభు, రాజు,తదితరులు ఉన్నారు.

# ఇందిర మహిళా శక్తి చీరల పంపిణి

**-పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవి**



**కడ్తాల్, నవంబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: కడ్తాల్ మండల కేంద్రంలో ఇందిర మహిళా శక్తి చీరల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ మల్లు రవి, శాసనసభ్యులు కశిరెడ్డి నారాయణ రెడ్డి హాజరై వారి చేతుల మీదుగా ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మెన్ యట గీత నర్సింహా, పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్ ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యట నర్సింహా, ఎంపిడిఓ సుజాత, తహసీల్దార్ జయ శ్రీ ,బ్యాంకు లింకేజ్ డిపియం యాదయ్య, ఎపియం రాములు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కుమారి కార్యదర్శి పుష్పలత, కోశాధికారి వారలష్మి, ఉప అధ్యక్షురాలు సుజాత, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి ,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్య నాయక్, మాజీ సర్పంచులు విటలయ్య గౌడ్ , పర్వతాలు, మహేందర్ రెడ్డి , శంకర్ నాయక్, పాలకూర్ల రవి , శ్రీకాంత్ గౌడ్ గ, లక్ష్మయ్య , కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బందికి గిరిజన సంఘం ఘన సన్మానం



**వాడపల్లి, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వాడపల్లి ఎస్ఐ ఏ. శ్రీకాంత్ రెడ్డి, జమిందార్ నాగిరెడ్డి తో పాటు పోలీస్ సిబ్బందిని గణేష్ పహాడ్ గిరిజన సంఘ నాయకులు తేజావత్ వెంకటేష్ నాయక్, కొర్ర లక్ష్మణ్ నాయక్ మరియు గిరిజన మహిళలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఒక కేసు విషయంలో గిరిజనుల పక్షాన నిలబడి వారికి తగిన న్యాయం చేసినందుకు కృతజ్ఞత భావంతో ఈ సన్మానం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.కార్యక్రమంలో వాడపల్లి గ్రామానికి చెందిన దళిత, బీసీ నాయకులు ఉలవపూరి రాజేష్, సుదర్శన్, సుందర్ రావు, ముడి రాజశేఖర్, దస్తగిరి, అరవింద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ వాసికి జాతీయ అవార్డు

## అరుదైన గౌరవం



**మిర్యాలగూడ, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మిర్యాలగూడకు చెందిన జర్నలిస్టు పుట్ల నాగేశ్వర్‌రావు జాతీయ స్థాయి ఉత్తమ జర్నలిస్టు అవార్డు అందుకోవడం అరుదైన గౌరవమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ పేర్కొన్నారు.సోమవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయనను శాలువా, పూలదండ, మెమోంటోతో సన్మానించారు. జర్నలిస్టు రంగంలో చేసిన కృషికి తగిన గుర్తింపు లభించిందని, అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగిందని, భవిష్యత్తులో ఇదే ఉత్సాహంతో పనిచేసి మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బిసి జేఏసీ కో కన్వీనర్ చేగొండి మురళీ యాదవ్, మండల విద్యాధికారులు బాలాజీ నాయక్, వెంకన్న నాయక్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, బిసి సంఘం నాయకులు సిరిసాల శ్రీనివాస్, మొకుదెబ్బ, సూర్యాపేట జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పోచారంలో ఎక్సైజ్ కార్యాలయ ప్రారంభం

## మత్తు పదార్థాలపై ఉక్కుపాదం



**పోచారం, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మద్యం కల్తీ, గంజాయి, డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదని ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు.మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ నారపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయంలో కాప్రాకు సంబంధించిన కొత్త కార్యాలయాన్ని ఆయన సోమవారం డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు 14 ఎక్సైజ్ కార్యాలయాలను ప్రారంభించామని, అందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 9 కార్యాలయాలు ఉన్నాయని తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణలో ఎక్సైజ్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, కొత్తగా ఏర్పడబోయే మద్యం దుకాణాలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పోలీస్ అధికారులు, బి బ్లాక్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మాజీ చైర్పర్సన్ మల్లి పావని, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పలుగుతండ వాసి అదృశ్యం



**మాడుగుల, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మాడుగుల మండలంలోని పలుగుతండ గ్రామానికి చెందిన వసురామ్ (వయసు 45, తండ్రి: లాలూ) అదృశ్యమయ్యాడు. భార్య మేరావత్ బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, నవంబర్ 23వ తేదీ రాత్రి సుమారు ఏడు గంటలకు ఇంటి నుంచి చేపలు కొనడానికి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ కూడా ఇంట్లోనే ఉన్నట్లు తెలిసింది.అర్కపల్లి గ్రామానికి చెందిన చంద్ పాషా వసురామ్‌ను చూసినట్లు, బ్రాహ్మణపల్లి పరిచయస్తుల ఇంటికి వెళ్తున్నానని చెప్పాడని సమాచారం. అయితే చుట్టుపక్కల వెతికినా ఎటువంటి ఆధారాలు లభించలేదు.వసురామ్ ఎత్తు 5.6 అడుగులు, రంగు ఎరుపు. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు నీలం రంగు గళ్ళ చొక్కా ధరించి ఉన్నాడు.అతని గురించిన సమాచారం తెలిసిన వారు మాడుగుల పోలీస్ స్టేషన్ నంబర్ 8712662674కు తెలియజేయాలని సిఐ వేణుగోపాల్ కోరారు.

# చెత్త సమస్యపై బల్దియా చర్యలు



**కుత్బుల్లాపూర్, నవంబర్24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఆస్బెస్టాస్ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఐడిపీఎల్, ఐలా, జిహెచ్ఎంసి పరిధిలోని ఓపెన్ ల్యాండ్‌లో చెత్త వేస్తున్నారని, దీనివల్ల కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు.వినతి పత్రం అందుకున్న వెంటనే జిహెచ్ఎంసి సానిటరీ అధికారి మనోహర్ రెడ్డిని అక్కడికి పంపించారు. చెత్త వేస్తున్న వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని జరిమానా విధించారు.ఈ చర్యలో సహకరించిన ఆస్బెస్టాస్ కాలనీ వాసులు బాలరాజ్, రవికిరణ్, శ్రీకాంత్, ఆనంద్ జే హెచ్ ఏలను జిహెచ్ఎంసి, ఐలా అధికారులు అభినందించారు.

# చింతల్ డివిజన్‌లో సీసీ రోడ్డు పనుల పరిశీలన



**చింతల్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** చింతల్ డివిజన్‌లోని అన్ని కాలనీలలో సీసీ రోడ్డు పనులు పూర్తి చేస్తామని మహ్మద్ రఫీ తెలిపారు. 128వ చింతల్ డివిజన్ వల్లభాయ్ పటేల్ నగర్‌లో రూ. 15 లక్షల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలనీలో ఇంకా రెండు వీధుల్లో రోడ్డు వేస్తే మొత్తం పనులు పూర్తవుతాయని, ఆ గల్లీల పనుల ప్రతిపాదనలు పంపించామని, త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాలనీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ రావు, రామిరెడ్డి, నాయబ్ రసూల్, నర్సీమ్మ యాదవ్, లక్ష్మా రెడ్డి, ఇబ్రహీం, వరప్రసాద్, షాదుల్ల, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ.



**ఎలిగేడు, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి ,ఉక్కు మహిళగా పేరుగాంచిన శ్రీమతి ఇందిరా గాంధీ గారిని గుర్తు చేసుకుంటూ మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను సోమవారం ఎలిగేడు మండల కేంద్రంలో మహిళ సమాఖ్యల ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివో అధ్యక్షురాలు రేఖ, రేణుక, సుమలత, వివో ఏలు కౌసల్య, రాజేశ్వరి, మమత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకై కళా ప్రదర్శన.



**ఎలిగేడు, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బాల్యవివాహాల నిర్మూలనకై ఎలిగేడు మండల కేంద్రంలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కళాకారులచే ప్రదర్శన నిర్వహించారు . ఈ సందర్భంగా సమాజంలో ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకై కృషి చేయాలని బాల్యంలో పెళ్లి చేస్తే ఆడపిల్లలకు జరిగే అనర్థాలను పాటల రూపకంగా ప్రదర్శించారు. ఈ కళా ప్రదర్శన ప్రజలను ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కళ కళాకారులు కాసిపేట అశోక్, ఢిల్లీ, మండలంలోని అంగన్వాడీ టీచర్లు ఆయాలు ఆశలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లోజు ఆచారి కి ఘన సన్మానం



**ఆమనగల్లు, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిని కేంద్ర ఉక్కు & భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, సీనియర్ నాయకుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు



**ఆమనగల్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్‌లో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావుకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు కలిసి ఆయనకు శాలువా కప్పి సన్మానం చేశారు.అచ్చంపేట నియోజకవర్గంలోని బౌరాపూర్ చెంచు పెంటల పర్యటనలో భాగంగా ఆమనగల్ మున్సిపాలిటీకి విచ్చేసిన సందర్భంగా, అటల్ బిహారీ వాజ్పేయి చౌరస్తా వద్ద మండల, మున్సిపాలిటీ శాఖ ఆధ్వర్యంలో స్వాగత కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మండల అధ్యక్షుడు కెకె శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసింహ, పార్లమెంట్ బీజెవైయమ్ కో కన్వీనర్ రవిరాథోడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ పద్మ ప్రశాంత్, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ సింగ్‌తో పాటు చెన్నకేశవులు, శ్రీధర్, శ్రీనివాస్, రాఘవ, శ్రీశైలం, గంజీ శ్రీను, జగన్ రెడ్డి, శ్రీను యాదవ్, నరసింహ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యలు తీవ్రతరం


అంబేద్కర్ కూడలి దగ్గర ట్రాఫిక్ జామ్


ట్రాఫిక్ జామ్ ఇరుక్కుపోయిన 108 వాహనం

## ఇబ్బందుల్లో ప్రజలకు

**బోడుప్పల్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం నుండి సాయిబాబా ఆలయం వీరరెడ్డి నగర్ చౌరస్తా వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ సమయంలో ట్రాఫిక్ అధికారులు ఉంటే సమస్య కొంతవరకు తగ్గుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భారీ వాహనాలు లారీలు, డీసీఎంలు, టిప్పర్లు ఈ రద్దీకి ప్రధాన కారణమని చెబుతున్నారు. ఉప్పల్ మార్గంలో నో ఎంట్రీ



నిరుపయోగంగా ఉన్న ట్రాఫిక్ అధికారి స్టాండ్...

ఉండటంతో అవి బోడుప్పల్ మార్గాన్ని ఎంచుకోవడం ట్రాఫిక్ జామ్‌ను మరింత పెంచుతోంది. శనివారం సాయంత్రం అత్యవసర వాహనం 108 కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన ఘటన స్థానికులను ఆందోళనకు గురి చేసింది. ప్రతి సోమవారం రోజున సాయిబాబా ఆలయం నుండి మల్లన్న ఆలయం హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకు ప్రధాన రహదారి ఇరువైపులా కూరగాయల మార్కెట్, చిన్న వ్యాపారాలు జరుగుతుండటంతో రద్దీ మరింత పెరుగుతోంది. ఆర్టీసీ బస్సులు ఇంద్రనగర్ కాలనీకి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకోవడం, సోమవారం రోజున వీరరెడ్డి నగర్ చౌరస్తా వద్దే దింపడం, మలుపు తిప్పే ప్రయత్నంలో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోతుంది. స్థానికులు ఎన్నిసార్లు సూచించినప్పటికీ ఆర్టీసీ డ్రైవర్లు బయ్యానగర్ కాలనీ, హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర ఉన్న ఖాళీ స్థలాన్ని ఉపయోగించకుండా రద్దీ ప్రాంతంలోనే బస్సులను తిప్పడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అయ్యప్ప, ఆంజనేయ స్వాముల మహాపడి మహోత్సవం

**అచ్చంపేట, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ ప్రజా భవన్, స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శ్రీ అయ్యప్ప స్వామి, శ్రీ ఆంజనేయ స్వాముల మహాపడి పూజ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దంపతులు, సి.బి.యం చైర్మన్, ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధతో పాటు పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం

### సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్



**వెల్దండ, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వెల్దండ మండలంలోని అంకమోనీకుంట గ్రామానికి చెందిన సంజయ్ రెడ్డి (తండ్రి: శ్రీనివాస్ రెడ్డి) ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 37,500 చెక్కును రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా పేద, మధ్యతరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణకు సీఎంఆర్ఎఫ్ విశేషంగా తోడ్పడుతోందని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఈ నిధి నిజమైన వరమని అన్నారు. కార్యక్రమంలో వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, కలకొండ మాజీ సర్పంచ్ పవన్ కుమార్, వెల్దండ మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, తలకొండపల్లి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఏఎంసి డైరెక్టర్ సుభాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల అభివృద్ధికి ఎమ్మెల్యే వంశీకృష్ణ కృషి

**అచ్చంపేట,**
**నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**



అచ్చంపేట నియోజకవర్గంలో మాదిగల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు మాదిగల తరపున ధన్యవాదాలు తెలిపారు. అచ్చంపేట ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్ మాట్లాడుతూ, దండోరా కాలనీ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రాబట్టడంలో స్థానిక ఎమ్మెల్యే కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, డీజిలైట్లు వంటి మౌలిక వసతుల ఏర్పాటుకు భారీ స్థాయిలో చర్యలు చేపట్టడం వల్ల ఎన్నో ఏళ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్న మాదిగల కాలనీలో ఇప్పుడు ఆధునిక వసతులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ కృషి వల్ల అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని, ఆయన సేవలను అభినందిస్తున్నామని రాజగోపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా అదృశ్యం కేసు నమోదు

**తెలకపల్లి, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



తెలకపల్లి మండలంలోని రాంరెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఈదుల కురుమూర్తి (వయసు 35, వృత్తి: తాపీ మేస్త్రి) భార్య గీత (వయసు 34) అదృశ్యమయ్యారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమాన్ కోట గ్రామానికి చెందిన గీతను కురుమూర్తి 17 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. నవంబర్ 21వ తేదీ ఉదయం సంసార విషయమై దంపతుల మధ్య గొడవ జరిగింది. అదే రోజు రాత్రి సుమారు 7 గంటలకు గీత తన భర్త, పిల్లలకు భోజనం పెట్టి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల వద్ద, పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు ఆమె ఎల్లో రంగు చీర, బిస్కెట్ రంగు బ్లౌజ్ ధరించి, చామన చాయ రంగులో ఉన్నారని భర్త కురుమూర్తి తెలిపాడు. ఈ మేరకు ఆయన ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## తలకొండపల్లిలో ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ



**తలకొండపల్లి,**
**నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకి గార్డెన్‌లో మహిళలకు ఇందిర మహిళా శక్తి చీరలను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని తెలిపారు. తలకొండపల్లి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని, త్వరలోనే వెల్జాల గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేస్తామని పేర్కొన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ పేదలకు ఇండ్లు, భూములు పంచి అనేక సంస్కరణలు చేపట్టిన ఉక్కు మహిళగా గుర్తింపు పొందారని, ఆమె స్ఫూర్తితో తెలంగాణలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిర మహిళా శక్తి చీరలను అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆడపడుచులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందించిన ఈ కానుకకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అమన్‌గల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యటా గీత నరసింహ ముదిరాజ్, పి.పి.సి సభ్యులు అయిల్ శ్రీనివాస్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డొకురి ప్రభాకర్ రెడ్డి, పి.సి.సి కిసాన్ సెల్ కార్యదర్శి డి. మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు కాసు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, అధికారులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ రథానికి విరాళం



**కాల్వ శ్రీరాంపూర్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాల్వ శ్రీరాంపూర్ లో వైకుంఠ రథం కోసం రావి రాజలింగం, ఆయన కుమారుడు రవి రూ. 25,000 విరాళాన్ని అందజేశారు. విరాళం అందజేసిన వారిని మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, వైకుంఠ రథ చైర్మన్ మూల రమణారెడ్డి ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాదాసు సతీష్, యాంసాని వంశీకృష్ణ, అయ్యప్పలేదా బంగారు రమేష్, పెద్దిరెడ్డి వీరారెడ్డి, శివరామకృష్ణ, ఎనగంటి రవి, తాండ్ర సురేష్, రానా వేణక్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం పై నిరంజన్ రెడ్డి ఫైర్



**వనపర్తి, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి జిల్లా పార్టీ కార్యాలయంలో టీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కవితపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ అస్తిత్వం అంటే పట్టుచీరలు, గోల్డ్ వాచీలు కాదని, లిక్కర్ రాణికి దందాలు మాత్రమే తెలుసు అనుకున్నామని, కానీ దౌర్జన్యం కూడా తెలుసని ఈనాడే అర్థమైందని వ్యాఖ్యానించారు.రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగంపై పూర్తిగా విఫలమైందని, ఇప్పటివరకు 720 మంది రైతులు ప్రాణాలు తీసుకోవడం దుర్ఘటన అని ఆయన అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో పది శాతం పనులు పూర్తి చేస్తేనే నీళ్లు వచ్చే పరిస్థితి ఉన్నా, సీఎం రేవంత్ స్పందించడం లేదని విమర్శించారు.తనపై కవిత చేసిన ఆరోపణలు అసత్యమని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. "నేను ఎప్పుడూ పల్లెటూరి భాషలో కవితను విమర్శించలేదు కావాలనే సోషల్ మీడియాలో నాపై కబుర్లు పుట్టిస్తున్నారు" అని అన్నారు. తనకు విలాసవంతమైన ఫామ్‌హౌజ్‌లు లేవని, స్వగ్రామంలో ఒకే ఒక వ్యవసాయ క్షేత్రం మాత్రమే ఉందని తెలిపారు. "నీకు హైదరాబాద్, గండిపేట ఫామ్‌హౌజ్‌లు ఎక్కడివి?" అని ప్రశ్నించారు."కెసిఆర్ కూతురవు గనుక గౌరవిస్తున్నాం కానీ ఆ గౌరవాన్ని కాపాడుకోలేదు. మేము పార్టీకి వన్నె తెస్తుంటే నువ్వు నేతలను మానసికంగా వేధిస్తున్నావు" అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# వనపర్తి జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సునిత



**వనపర్తి, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి జిల్లా నూతన ఎస్పీగా డి. సునిత సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్పి వెంకటేశ్వరరావు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, కార్యాలయంలో పదవీ బాధ్యతలను చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు మరింత చేరువగా ఉండే ఆధునిక పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తానని తెలిపారు. పారదర్శక పాలన, సమర్థమైన నేర నివారణ, సాంకేతిక ఆధారిత సమాచార వ్యవస్థలతో పోలీసు విభాగాన్ని బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు స్పష్టమైన న్యాయం, వేగవంతమైన సేవ, భద్రతాభావం కల్పించడం పోలీసుశాఖ ప్రధాన లక్ష్యమని అన్నారు.డ్రగ్ మాఫియా, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అవినీతి, అసాంఘిక ప్రవర్తనపై రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళలు, పిల్లలు భయం లేకుండా జీవించే వాతావరణం కల్పించడం పోలీసు శాఖ బాధ్యత అని స్పష్టం చేశారు. "చట్టం ముందు అందరూ సమానమే. ప్రజల నమ్మకం పెరిగితేనే సమర్థ, ప్రభావవంతమైన పోలీసింగ్ సాధ్యం" అని అన్నారు.ఆన్లైన్ బెట్టింగ్ కార్యకలాపాలు, ప్రమోషన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రంక్ %డ% డ్రైవింగ్, ఓవర్‌స్పీడింగ్‌పై జీరో టోలరెన్స్ అమలు చేస్తామని, హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.వనపర్తి జిల్లాను రాష్ట్రంలో భద్రతా పరంగా ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడం లక్ష్యమని ఎస్పీ సునిత పేర్కొన్నారు. అనంతరం జిల్లాలోని పోలీసు అధికారులు అపోలో మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం





**వర్ధన్నపేట, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు.సోమవారం వర్ధన్నపేట మండలం కేంద్రంలో పద్మశాలి యువజన సంఘం టౌన్ ప్రెసిడెంట్ పెద్దూరి రాజ్ కుమార్, చెన్న శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టు ను కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు.ఇటువంటి క్రీడ కార్యక్రమాలు మన ప్రాంతంలో ఎక్కడ నిర్వహించినా తన వంతు కృషి చేస్తారని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమం లో సిలివేరు కుమారస్వామి, పెద్దూరి సంజీవ రావు, తుమ్మల యాకయ్య,గోశాల అనిల్, సంకినేని వెంకట్, దర్గయ్య, సారంగపాణి, జనార్ధన్, పాశికంటి రాంచందర్, గోక శ్రీనివాస్, సిలివేరు రాజ్ కుమార్, చిప్ప వెంకటేశ్వర్లు, చిదిరాల కేదారి తదితరులు పాల్గొన్నారు.

# 2027 జనాభా గణనకు సిద్ధం..!

## - మిమ్మల్ని అడిగే ప్రశ్నలు ఇవే..!



**న్యూఢిల్లీ-నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కొత్త ఏడాది 2027 జనాభా గణన ప్రారంభం కాబోతున్నది. ఎన్యుమరేటర్లు ఇండ్లకు చేరుకొని సమాచారం సేకరించారు. సర్వేయర్లంతా మీ ఇంటి నిర్మాణం నుంచి దాని ఉపయోగం వరకు ప్రతిదాని సమాచారం సేకరించనున్నదారు. ఉదాహరణకు సౌరశక్తి నుంచి ఇంటర్నెట్ వినియోగం వరకు ప్రతిదానిపై సమాచారాన్ని కోరనున్నారు. ఇంటి నేల, పైకప్పు, గోడలు దేనితో తయారు చేస్తారు? ఇల్లు నివాసంగా ఉపయోగిస్తున్నారా? కార్యాలయమా..? గెస్ట్‌హౌసా? ప్రార్థన స్థలం కూడా ఉందా?.. కాలువ, నది, బావి, చేతిపంపు, నల్లాల ద్వారా నీరు అందుతుందా? ప్యాకేజ్డ్, సీసాల్లో నీటిని ఉపయోగిస్తారా? అనే సమాచారాన్ని సేకరించనున్నారు. అలాగే, టెలిఫోన్లు, స్మార్ట్‌ఫోన్ల గురించిన సమాచారం కూడా సేకరించనున్నారు. దీని ఉద్దేశం కేవలం దేశ ప్రజల జీవన ప్రమాణాలు అర్థం చేసుకోవడమే. డేటా అభివృద్ధి చెందిన భారత ప్రచారంలో కొత్త విధానాలను రూపొందించడంలో, ఇప్పటికే ఉన్న విధానాల్లోని లోపాలను సరిదిద్దడంలో సహాయపడనున్నది. 2027 జనాభా లెక్కల మొదటి దశ కోసం గృహాల జాబితా, గృహాల గణన షెడ్యూల్ జాబితాను తయారు చేసే ప్రచారాన్ని కేంద్రం ముమ్మరం చేసింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరుగనుండగా.. ఇందు కోసం 30కిపైగా ప్రశ్నల జాబితా సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో జారీ చేయనున్నారు. ఇంటి యజమాని నుంచి ఇంట్లో ఉన్న కారు, మోటార్ సైకిల్, సైకిల్, మోపెడ్ గురించిన సమాచారం సేకరిస్తారు. ఇంట్లో వంట చేయడానికి ఏమి ఉపయోగిస్తున్నారు? కలప, పంట వ్యర్థాలు, పిడకలు, బొగ్గు, గోబర్ గ్యాస్, కిరసనాయిల్, ఎల్‌పీజీ, పీఎన్‌జీ, సోలార్ ఎనర్జీ ఇలా ఏం వాడుతున్నారో తెలుసుకొని రికార్డు చేయనున్నారు. టీవీ, ల్యాప్‌టాప్, ల్యాండ్‌లైన్, మొబైల్ ఫోన్‌లలో డిష్, డీటీహెచ్ వినియోగిస్తున్నా ఆ సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే గోధుమ, జొన్న, బియ్యం, మిల్లెట్, మొక్కజొన్న వాడకం గురించి కూడా ప్రశ్నలు ఉంటాయి.2027 జనాభా లెక్కల మొదటి దశ వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో ఇళ్ల వివరాలు, అందులో నివసించే ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉన్నాయో తెలుసుకోనున్నారు. ప్రస్తుతం, లడఖ్, పశ్చిమ బెంగాల్ మినహా దేశవ్యాప్తంగా తొలిదశ సర్వే కోసం రిహార్సల్స్ జరుగుతున్నాయి. ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి డేటాను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయనున్నారు. తొలిసారిగా డిజిటలైట్ చేస్తుండడం వల్ల జనాభా గణణ డేటా త్వరలోనే అందుబాటులోకి రానున్నది. గతంలో జనాభా గణన వివరాలు వేగంగా అందుబాటులోకి వచ్చినా.. వివరణాత్మక డేటా వచ్చేందుకు చాలా సంవత్సరాలు పట్టేది. రెండో దశలో 2027లో దేశవ్యాప్తంగా జనాభా గణన ఉంటుంది. ఇందులో కుల గణన కూడా ఉంటుంది. స్వాతంత్ర్యం తర్వాత జనాభా గణణలో మొబైల్ యాప్స్, పోర్టల్స్‌ను ఉపయోగిస్తారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఉంటాయి. రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ ఆఫీస్ ఆఫ్ ఇండియా అన్ని రాష్ట్రాలకు వివరణాత్మక సూచనలను పంపింది.

# మరోమారు కుత్సిత బుద్ధిని చాటుకున్న చైనా

- అరుణాచల్ యువతికి చైనాలో అవమానం
- పాస్‌పోర్ట్ ఉన్నా..చెల్లదని వేధింపులు



**న్యూఢిల్లీ- నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

చైనా మరోమారు తన కుత్సిత బుద్ధిని చాటుకుంది. అరుణాచల్ తమదే అన్న వాదన కోసం ఏ చిన్న అవకాశం దొరికినా వదలడం లేదు. తాజాగా ఇలాంటి ఘటన కలకలం రేపింది. చైనాలో షాంఘై పుడాంగ్ విమానాశ్రయంలో భారత మహిళకు వేధింపులు ఎదురయ్యాయి. అరుణాచల్ ప్రదేశ్ చైనాదే అంటూ తన భారత పాస్‌పోర్ట్‌ను గుర్తించేందుకు ఆ దేశ అధికారులు నిరాకరించారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈనెల 21న పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ అనే మహిళ లండన్ నుంచి జపాన్‌కు వెళ్లే విమానం ఎక్కారు. అయితే ట్రాన్సిట్ హాల్ట్ కోసం అది చైనా నగరం షాంఘైలో దిగింది. అక్కడ తన పాస్‌పోర్ట్‌ను అధికారులు తనిఖీ చేశారని ఆమె చెప్పారు. అందులో తాను పుట్టిన రాష్ట్రం పేరు అరుణాచల్ ప్రదేశ్ అని ఉందని వెల్లడించారు. అది చూసిన తర్వాత ఇమిగ్రేషన్ అధికారులు తన పాస్‌పోర్ట్ చెల్లదని ప్రకటించారని ఆమె ఆరోపించారు. వారు ఆ ఈశాన్య రాష్ట్రాన్ని చైనాలో భాగమని పట్టుబట్టారన్నారు. ఇమిగ్రేషన్ అధికారులు, చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ సిబ్బంది తనవైపు చూసి నవ్వారని, చైనీస్ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోమని హేళన చేశారని ఆమె వాపోయారు. చెల్లుబాటు అయ్యే వీసా ఉన్నా కూడా తన పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారని, జపాన్ వెళ్లే విమానం ఎక్కనివ్వలేదని మీడియాకు వెల్లడించారు. తనను ట్రాన్సిట్ ఏరియాకే పరిమితం చేశారని, మళ్లీ టికెట్లు బుక్ చేసుకోనివ్వలేదని, చివరకు ఆహారం కొనేందుకు కూడా అంగీకరించలేదన్నారు. యూకేలోని ఫ్రెండ్ ద్వారా షాంఘైలోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించిన తర్వాతే తనకు సహాయం అందిందని పేర్కొన్నారు. భారత అధికారుల సహాయంతోనే తాను అక్కడి నుంచి బయట పడినట్లు చెప్పారు. అలాగే దీనిపై తాను ప్రధాని మోదీకి, ఇతర సీనియర్ అధికారులకు లేఖ రాసినట్లు చెప్పారు. ఇదంతా భారత సార్వభౌమత్వాన్ని, అరుణాచల్ ప్రదేశ్ ప్రజలను అవమానించడమేనని ఆ లేఖలో అభివర్ణించారు. ఈ పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ ప్రస్తుతం యూకేలో నివసిస్తున్నారు.ఈ వ్యవహారంపై అధికారికంగా ఎలాంటి స్పందనా రాలేదు.

# పడిపోయిన ముస్లిం ఎమ్మెల్యేల వాటా



**పాట్నా నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

2025లో బీహార్‌లో ఎన్నికైన ముస్లిం ఎమ్మెల్యేల సంఖ్య11కి పడిపోయింది. అత్యధికంగా ముస్లిం జనాభా కలిగిన ఈ రాష్ట్రంలో ముస్లిం ఎమ్మెల్యేల వాటా 4.5శాతానికి క్షీణించిందని, 2000 తర్వాత ఇప్పుడు అత్యల్ప ముస్లిం ఎమ్మెల్యేలు ఉన్నట్లు సమాచారం. 2025లో బీహార్‌లో ఎన్నికైన ఎమ్మెల్యేల సంఖ్య 11 కాగా, ఇది సంవత్సరాల్లో అత్యల్పం. 2020 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 42శాతం తగ్గుదల. ఆ ఎన్నికల్లో 19 మంది ముస్లిం ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. తర్వాత ఇప్పుడు అత్యల్ప ముస్లిం ఎమ్మెల్యేలను కలిగి ఉండటం గమనార్హం. 2022 బీహార్ కుల (జన)గణన లెక్కల ప్రకారం.. బీహార్ జనాభాలో ముస్లింలు 17.7శాతం ఉన్నారు. అయితే రాష్ట్ర అసెంబ్లీలో ముస్లింల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. అంటే వారి సభ్యుల్లో 10శాతం కంటే తక్కువ మంది ఉన్నారు. 243 మంది సభ్యులున్న సభలో ముస్లిం ఎమ్మెల్యేలు 4.5శాతానికి పడిపోయి .. కనిష్ట స్థాయికి చేరుకుంది. పదిమంది ముస్లిం ఎమ్మెల్యేలను ఎఐఎంఐఎం బరిలోకి దింపగా.. ఐదుగురు విజయం సాధించారు. ఆర్‌జెడి, కాంగ్రెస్‌ల నుండి వరుసగా ముగ్గురు మరియు ఇద్దరు ఎన్నికైన ప్రతినిధులు ఉన్నారు. ఎండి.జమాఖాన్ అధికారిక కూటమి జెడి(యు) తరపున గెలిచారు. 2025 ఎన్నికల్లో పోటీ చేసిన ముస్లిం అభ్యర్థులు తగ్గడం కూడా మరో కారణం కావచ్చని విశ్లేషకుల వాదన. ఈ ఏడాది బీహార్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల విశ్లేషణ ప్రకారం.. మొత్తం అభ్యర్థుల జాబితాలో ముస్లింలు కేవలం 11.8శాతం మాత్రమే ఉన్నారు. స్వతంత్రులను మినహాయిస్తే.. ఈ వాటా 7.6శాతానికి తగ్గింది. రాజకీయపార్టీల తరపున పోటీలో నిలిచిన అభ్యర్థులను మాత్రమే ఇది వర్తిస్తుంది. ఇటీవల బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ విజయం సాధించిన సంగతి తెలిసిందే.

# బెంజ్ కారును వదిలి వెళ్లిన మాజీ సీజేఐ గవాయ్..



**న్యూఢిల్లీ-నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

మాజీ సీజేఐ బీఆర్ గవాయ్ .. కొత్త సంప్రదాయానికి తెరలేపారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారోత్సవానికి అధికారిక మెర్సిడీజ్ బెంజ్ కారులో వచ్చిన బీఆర్ గవాయ్.. కార్యక్రమం ముగిసిన తర్వాత తన స్వంత కారులో వెళ్లిపోయారు. నూతనంగా సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ సూర్యకాంత్ కోసం ప్రభుత్వ బెంజ్ కారును ఆయన విడిచి వెళ్లారు. నవంబర్ 23వ తేదీన సీజేఐ గవాయ్ పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో ఇవాళ రాష్ట్రపతి భవన్‌లో జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. రాష్ట్రపతి ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఫంక్షన్ ముగిసిన తర్వాత మాజీ సీజేఐ గవాయ్.. తన పర్సనల్ కారులో ఇంటికి వెళ్లిపోయారు. ప్రస్తుతం సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ సూర్యకాంత్‌కు అధికారిక లగ్జరీ కారు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో గవాయ్ తన పర్సనల్ వెహికల్‌లో వెళ్లారు.జస్టిస్ సూర్యకాంత్ 53వ సీజేఐగా ప్రమాణ స్వీకారం చేశారు. దేవుడి మీద ప్రమాణం చేసి ఆయన హిందీ భాషలో శపథం చేశారు. అక్టోబర్ 30వ తేదీన తదుపరి సీజేఐగా ఆయన్ను నియమించిన విషయం తెలిసిందే. 2027 ఫిబ్రవరి 9 వరకు అంటే 15 నెలల పాటూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, పియూష్ గోయల్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సహా పలువురు ఎంపీలు పాల్గొన్నారు.